ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
శ్రీ సత్యసాయి
జిల్లా వార్తలు
సోమవారం 30 డిసెంబరు 2024


హంద్రీనీవా కాలువ

పునరుజ్జీవం..!

- ఉమ్మడి జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులకు మహర్దశ
- హెచ్చెల్సీ, హంద్రీనీవా అభివృద్ధికి రూ.కోట్ల నిధులు
- ఎన్నికలతో సాగునీటి సంఘాలకు జవసత్వాలు
- ప్రతి ఎకరాకు నీరు ఇవ్వడానికి కూటమి సర్కారు యత్నం
- వైసీపీ పాలనలో కుదేలైన సాగునీటి రంగం

7లో...

కోటి కాంతులు..!

సూర్యఘర్ పథకంతో తప్పనున్న విద్యుత్ బాధలు



- సోలార్ ప్లేట్ల ఏర్పాటుతో ఎన్నో లాభాలు
- పంచాయతీకి రూ.కోటి నజరానా
- నియోజకవర్గంలో ఒకటి ఎంపిక


గుండుమల గ్రామంలో సోలార్ ప్లాంట్ ఏర్పాటుపై అవగాహన కల్పిస్తున్న అధికారులు (ఫైల్)

హిందూపురం, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా పునరుత్పాదక ఇంధన వనరుల వినియోగంపై కేంద్రం దృష్టిపెట్టింది. అందులో భాగంగా విద్యుదుత్పత్తి దిశగా సూర్యఘర్ ముఫ్త్ బిజిలి యోజనకు శ్రీకారం చుట్టింది. ఈ పథకం కింద ప్రతి ఇంటిపై సోలార్ పలకాలు ఏర్పాటు చేసుకోవాలి. ఇంటి అవసరాలకు విద్యుత్‌ను అక్కడే ఉత్పత్తి చేసుకునేలా ప్రోత్సహిస్తోంది. పట్టణ, గ్రామీణ స్థాయిల్లో విస్తారంగా ఇళ్లపై సౌరపలకల ఏర్పాటు చేసుకునే వారికి రాయితీలు ప్రకటించింది. దేశవ్యాప్తంగా జిల్లాల పరిధిలో నియోజకవర్గాల్లో 5వేలకుపైగా జనాభా కలిగిన పంచాయతీలను ఎమ్మెల్యేల ఆమోదంతో మోడల్ సేలర్ గ్రామాలను ఎంపిక చేస్తున్నారు. దీంతో కిలోవాట్ నుంచి 3 కిలోవాట్ల వరకు సామర్థ్యంగల సోలార్‌ప్లాంట్ అమర్చుకుంటే రూ.30వేలు, రూ.60వేలు, రూ.70వేలు చొప్పున లబ్ధిదారులకు రాయితీ అందించేలా కేంద్ర ప్రభుత్వం మార్గదర్శకాలు జారీచేసింది. సోలార్‌ప్లాంట్ ఏర్పాటును పోటీ పరిస్థితుల్లో జిల్లాల్లో అత్యధికంగా లక్ష్యం సాధించిన పంచాయతీలకు రూ.కోటి నగదు బహుమతి సైతం ప్రకటించింది. ఈ నేపథ్యంలో జిల్లాలో కూడా ప్రతి నియోజకవర్గానికి ఒక మోడల్ పంచాయతీని ఎంపిక చేసే పనిలో విద్యుత్‌శాఖ అధికారులు నిమగ్నమయ్యారు. ఆ దిశగా ఇప్పటికే ట్రాన్స్‌కో అధికారులు దరఖాస్తులు ఆహ్వానించారు. నిర్దేశించిన పంచాయతీల్లో అవగాహన కార్యక్రమాలు సైతం నిర్వహిస్తున్నారు. రోజురోజుకీ విద్యుత్ చార్జీలు పెరుగుతున్న నేపథ్యంలో వినియోగదారులపై మోయలేని భారం పడుతోంది. ఈ తరుణంలో కేంద్ర ప్రభుత్వం ముందుచూపుగా విద్యుత్‌శక్తి పునరుత్పాదనపై దృష్టి సారించింది. ఇళ్ల పైకప్పులపై సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తే రెండు భాగాలుగా రాయితీలు ఇవ్వనుంది. రెండు కిలోవాట్ల సామర్థ్యానికి 60 శాతం, అంతకన్నా ఎక్కువైతే 40 శాతం ఇస్తుంది. 3 కేవీ ప్లాంట్‌కు రూ.1.45 లక్షలు ఖర్చవుతుంది. దీనికి గరిష్ఠంగా రూ.78వేలు అందజేస్తుంది. మిగిలిన మొత్తానికి బ్యాంకుక ద్వారా రుణం సమకూర్చేలా భరోసా ఇస్తుంది. నెలకు 0-150 యూనిట్లు విద్యుత్ వాడేవారు 1-2 కేవీ వాడేవారు, 150 నుంచి 200యూనిట్లు ఉంటే 2-3 కేవీ సోలార్‌ప్లాంట్ ఏర్పాటు చేసుకోవాలి. ఒక ఇంటిపై గరిష్ఠంగా 3కిలోవాట్లు విద్యుత్ వ్యవస్థను ఏర్పాటు చేసుకోవచ్చు.

పంచాయతీల ఎంపిక

జిల్లాలోని హిందూపురం ట్రాన్స్‌కో ఈఈ కార్యాలయం పరిధిలో మడకశిర నియోజకవర్గంలోని గుండుమల పంచాయతీని మోడల్ పంచాయతీగా ఎంపిక చేశారు. హిందూపురం నియోజకవర్గంలో లేపాక్షి, పెనుకొండ పరిధిలో సోమందేపల్లి పంచాయలను ఎంపిక చేసినట్లు విద్యుత్‌శాఖ అధికారులు తెలిపారు. వీటి పరిధిలోని గ్రామాల్లో ప్రతి ఇంటిపై సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేసుకోవాలి. ఎంపిక చేసిన గ్రామానికి రూ.కోటి బహుమతి ఇస్తారు. ఆ మొత్తం పంచాయతీ అభివృద్ధికి ఖర్చు చేయవచ్చు. 5వేలకు పైగా జనాభా కలిగిన పంచాయతీల వారీగా సోలార్‌ప్లాంట్లు ఏర్పాటు చేసుకుని అత్యధిక ఫలితాలు సాధించిన పంచాయతీకి కేంద్ర ప్రభుత్వం రూ.కోటి బహుమతి అందజేస్తుంది. వివిధ అభివృద్ధి పనులకు వినియోగించుకునే సౌలభ్యం ఉంది. వ్యక్తిగతంగా కరెంటు బిల్లు తగ్గించుకోవచ్చు. పర్యావరణ పరంగా ప్రయోజనాలు కూడా పొందవచ్చు. మిగులు విద్యుత్ ఇంట్లోకి ఎన్ని యూనిట్లు వెళ్లిందో దానిని తిరిగి డబ్బుకూడా జమ అవుతుంది. నిరంతరాయంగా కరెంటు ఇవ్వాలన్న లక్ష్యం దీని ద్వారా పొందవచ్చు.

ఎంతగానో ఆదా..

1 కిలోవాట్‌కు 128 యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. ప్రస్తుతం ఉన్న ధర ప్రకారం నెలకు రూ.వెయ్యి బిల్లు వస్తుంది. సోలార్‌ప్లాంట్ ఏర్పాటు చేసుకుంటే రూ.350 మాత్రమే బిల్లు వచ్చే అవకాశం ఉంది. ఏడాదికి రూ.8వేలు ఆదా అవుతుంది. 2కేవీ అయితే ఏడాదికి రూ.20 వేలు, 3 కేవీలకు రూ.32 వేలకుపైగా ఆదా చేసుకోవచ్చు. అంతేకాక సోలార్ విద్యుత్‌ను 300యూనిట్ల దాకా వాడుకోవచ్చు. మిగిలితే నైట్ మీటరింగ్ కింద విక్రయించవచ్చు. తద్వారా నెలకు రూ.1200 ఆదాయం వస్తుంది. నెలకు రూ.610 రుణం వాయిదా కింద జమ చేసుకోవచ్చు. ఈ లెక్కన తీసుకున్న రుణం ఏడేళ్లలో తీరిపోతుంది. పెద్దపెద్ద అంతస్తులుంటే విద్యుత్ దీపాలు, వాహనాల చార్జింగ్ స్టేషన్‌కు కనెక్షన్ ఇచ్చుకోవచ్చు.

విస్తృతంగా ప్రచారం చేస్తున్నాం..

ఎంపిక చేసిన పంచాయతీల పరిధిలోని వినియోగదారుల ఇల్లు, భవనాలపై సబ్సిడీతో సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేసుకుంటే విద్యుత్ తయారీలో భాగస్వామ్యం కోసం ప్రోత్సాహకాలు అందిస్తారు. దీనిపై ఇప్పటికే అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ఇప్పుడిప్పుడే కొంతమందికి దరఖాస్తులు నమోదు చేసుకుంటున్నారు. అంతేకాక సోలార్ ప్లాంట్ ఏర్పాటులో పూర్తిస్థాయిలో ఏ పంచాయతీ నిలుస్తుందో దానికి కేంద్రప్రభుత్వం రూ.కోటి నిధులు కూడా బహుమతి కింద పంచాయతీలకు జమచేస్తుంది.

\- భూపతి, ట్రాన్స్‌కో ఈఈ, హిందూపురం

విద్యతోనే విముక్తి




విద్యతోనే విముక్తి నాటికలోని సన్నివేశాలు

పుట్టపర్తి, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): జైపూర్ విద్యార్థులు చేపట్టిన విద్యతోనే విముక్తి నాటిక భక్తులను ఆలోచింపజేసింది. రాజస్థాన్ భక్తులు పర్తియాత్రగా ఆదివారం స్థానిక ప్రశాంతి నిలయానికి చేరుకున్నారు. ఉదయం సాయికుల్వంత్ సభామండపంలో శ్రీసత్యసాయి అష్టోత్తర శతనామావళి పఠనం, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం విద్యార్థులు విద్యతోనే విముక్తి నాటికను ప్రదర్శించారు. విలువలతో కూడిన ఉత్తమ విద్యను అభ్యసించిన వారికి ఉన్నతపదవులతోపాటు సమాజంలో గౌరవ మర్యాదలు, భగవంతుని కృపాకటాక్షాలు ఉంటాయంటూ నాటిక ద్వారా తెలియజేశారు. విద్యార్థుల అద్భుత నటనను చూసి భక్తులు తన్మయత్వం పొందారు. అనంతరం సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.

గంజాయి స్వాధీనం

ముగ్గురి అరెస్టు


స్వాధీనం చేసుకున్న గంజాయి, గసగసాలను చూపుతున్న ఎక్సైజ్ అధికారులు

హిందూపురం, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): గోరంట్ల మండలంలో పాలసముద్రం క్రాస్ సమీపాన జాతీయ రహదారి పక్కనేగల మహదేవ్ రాజీ ధాబా వద్ద గంజాయి, గసగసాలు స్వాధీనం చేసుకుని, ముగ్గురిని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సీఐ లక్ష్మీదుర్గయ్య తెలిపారు. రాజస్థాన్‌కు చెందిన మంగల్‌రామ్, ఇంద్రజీత్, ధనరాం కొంతకాలంగా ధాబా నడుపుతున్నారు. ఈ నేపథ్యంలో వారు గంజాయిని 11గ్రాములు ప్యాకెట్లుగా చేసి విక్రయిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఆ మేరకు వారు ఆదివారం దాడులు చేశారు. 9 కేజీల గసగసాలు, గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. నిందితులను అరెస్టు చేశామన్నారు. దాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ అలీబేగ్, ఎక్సైజ్ ఎస్‌ఐలు పృథ్వీ, ఫారూక్, సిబ్బంది వెంకటసుబ్బయ్య, రామచంద్ర, వెంకటనారాయణ, సుధాకర్ రెడ్డి, చరణ్ పాల్గొన్నారు.

ఐదేళ్లూ నిరాశే..!

పడిపోయిన రియల్ వ్యాపారం
భారీగా తగ్గిన భూముల క్రయవిక్రయాలు
కొనేవారు కరువు
కూటమి ప్రభుత్వంపై ఆశలు

ఫ్ఛ..!


ముదిగుబ్బలో వెలసిన వెంచర్లు

ధర్మవరం/చెన్నేకొత్తపల్లి, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు ఓ వెలుగు వెలిగిన రియల్ ఎస్టేట్ వ్యాపారం నేడు ఉమ్మడిజిల్లావ్యాప్తంగా పతనావస్థలో ఉంది. ప్రధాన జాతీయ రహదారి పక్కన రూ.కోట్ల విలువ చేసే భూముల్లో సైతం క్రయవిక్రయాలు సాగకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది. గత టీడీపీ హయాంలో రియల్ ఎస్టేట్ జోరుగా సాగింది. 2019లో వైసీపీ అధికారం చేపట్టాక అంతా తారుమారైంది. రియల్ వ్యాపారం కుదేలైంది. ఈ ప్రభావం మిగిలిన వ్యాపారాలపై కూడా పడింది. ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండిపడింది. రిజిస్ట్రేషన్ల శాఖ పరిస్థితి మరీ అధ్వాన్నంగా తయారైంది. ఎక్కడికక్కడ రిజిస్ట్రేషన్లు నిలిచిపోవడంతో ఆ శాఖ ఆదాయంపై తీవ్ర ప్రభావం పడింది. రియల్ ఎస్టేట్ వ్యాపారుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది.

తగ్గిన క్రయవిక్రయాలు

భూముల అమ్మకాలు, కొనుగోళ్లు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. రియల్ వ్యాపారం ఊపందుకున్న రోజుల్లో భూముల ధరలకు రెక్కలొచ్చాయి. దీంతో అమ్మకాలు, కొనుగోళ్ల లావాదేవీలు అంతేస్థాయిలో సాగుతూ వచ్చాయి. 2014 నుంచి 2019 మధ్య రియల్ వ్యాపారం భారీగా సాగింది. దీంతో అప్పట్లో అమ్మకందారులు కూడా తమ భూముల రేట్లను అమాంతం పెంచుతూ పోయారు. కొనుగోళ్లు కూడా అదే స్థాయిలో సాగాయి. 2019 తరువాత ఒక్కసారిగా రియల్ వ్యాపారం తగ్గుముఖం పడుతూ వచ్చింది. భూముల అమ్మకాలు, కొనుగోళ్లు ఊసే ఎత్తని పరిస్థితి దాపురించింది. చివరికి జాతీయ రహదారి పక్కన ఉన్న రూ.కోట్ల విలువచేసే భూములు సైతం వ్యాపార లావాదేవీలు లేక ఎక్కడికక్కడే నిలిచిపోయాయి.

రిజిస్ట్రేషన్ల శాఖపై తీవ్ర ప్రభావం

రియల్ వ్యాపారం తీవ్ర సంక్షోభంలో పడడంతో ఆ ప్రభావం రిజిస్ట్రేషన్ల శాఖపై పడింది. రియల్ వ్యాపారంతో కళకళలాడిన ఆ శాఖ కార్యాలయాలు నేడు బోసిపోయిన పరిస్థితి. పట్టణాల్లోని ఆ శాఖ ప్రధాన కార్యాలయాల్లో కూడా రిజిస్ట్రేషన్లు అరకొరగా సాగుతున్నాయి. దీంతో ఆ శాఖ ఆదాయం పాతాళానికి పడిపోయింది.

అగమ్యగోచరం

రియల్ వ్యాపారుల పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. కొందరైతే భూములు కొనుగోలు చేసి, వెంచర్ వేసి అమ్మకానికి సిద్ధం చేసుకోగా.. కొనేవారు కరువయ్యారు. అమ్ముడుపోక దిక్కులు చూస్తున్నారు. రూ.కోట్లలో పెట్టుబడులు పెట్టి అమ్ముకోలేక వడ్డీల భారం భరించలేక నలిగిపోతున్నారు. కొందరైతే రియల్ భూముల కోసం తెచ్చిన సొమ్మును రుణదాతలు డిమాండ్ చేయడంతో నష్టాలకు అమ్ముకుందామన్నా కొనుగోలుదారులు ముందుకు రావట్లేదు. దీంతో ఏం చేయాలో దిక్కుతోచక తలలు పట్టుకుంటున్నారు.

కూటమి ప్రభుత్వంలోనైనా భూం వచ్చేనా?

కూటమి ప్రభుత్వం ఏర్పాటుతో రియల్ వ్యాపారుల్లో కొంత ఆశ చిగురించింది. తిరిగి రియల్ ఎస్టేట్ వ్యాపారం పుంజుకుంటుందనే ఆశాభావంతో ఉన్నారు. దీంతో పలువురు వ్యాపారులు భూముల కొనుగోళ్ల వైపు అడుగులు వేస్తున్నారు. ప్రస్తుతానికి అమ్మకాలు, కొనుగోళ్లలో స్తబ్దత నెలకొందనే చెప్పవచ్చు. రానున్న రోజుల్లో రియల్ వ్యాపారం పుంజుకోకపోతుందా అన్న ఆశతో వ్యాపారులు ఎదురుచూస్తున్నారు. అనంతపురంలో ఎయిర్‌పోర్టు నిర్మాణానికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతోపాటు కొత్తగా పరిశ్రమలు వస్తాయన్న ప్రచారం నేపథ్యంలో తిరిగి భూములకు విలువ పెరగడంతోపాటు వ్యాపారం కూడా త్వరలో పుంజుకుంటుందనే ఆశాభావంతో వ్యాపారులు ఉన్నారు.

పెట్టుబడులు పెట్టి ఇబ్బందులు పడుతున్నాం

అప్పోసప్పో చేసి భూములు కొనుగోలు చేసి, నిబంధనల మేరకు వెంచర్లు వేశాం. కొనుగోలుదారుల లేక, ప్లాట్లు అమ్ముడుపోక గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటున్నాం. త్వరలోనే పూర్వవైభవం వస్తుందన్న ధైర్యంతో ఉన్నాం.

\- కొత్తపేట ఆది, రియల్ ఎస్టేట్ వ్యాపారి



రియల్ ఎస్టేట్ దెబ్బతింది

ప్రస్తుతం రియల్ ఎస్టేట్ పూర్తిగా దెబ్బతింది. భూముల ధరలు బాగానే ఉన్నప్పటికీ కొనుగోళ్లు తగ్గిపోయాయి. త్వరలో పుంజుకుంటుందనే ఆశతో ఉన్నాం.

\- ప్రసాద్, రియల్టర్, ధర్మవరం

రిజిస్ట్రేషన్లు తగ్గిన మాట వాస్తవమే

రియల్ ఎస్టేట్ వ్యాపారం ప్రభావం రిజిస్ట్రేషన్ల శాఖపై కనిపిస్తోంది. జిల్లావ్యాప్తంగా రిజిస్ట్రేషన్లు తగ్గిపోయాయి.

\- కృష్ణకుమారి, జిల్లా రిజిస్ట్రార్

రామబ్రహ్మం రచనలు.. సామాజిక దర్పణాలు..

- పుస్తకావిష్కరణలో వక్తలు

పెనుకొండ, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన శాస్త్రవేత్త రామబ్రహ్మం రచనలు అన్నివర్గాల వారికి ఉపయోగపడే సామాజిక దర్పణాలని పలువురు వక్తలు కొనియాడారు. ఆదివారం రాత్రి స్థానిక వాసవీ కల్యాణమండపంలో రామబ్రహ్మం రచించిన 'రామా వినవేమిరా', 'భక్తి సుధా' పుస్తకాల ఆవిష్కరణ సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎస్కేయూ తెలుగు శాఖాధిపతి ఆచార్య బాలసుబ్రహ్మణ్యం రామా వినవేమిరా పుస్తకాన్ని ఆవిష్కరించగా.. కవి ఏలూరి యంగన్న సమీక్షించారు. భక్తి సుధా పుస్తకాన్ని ఆశావాది శశాంకమౌళి ఆవిష్కరించగా.. విన్నకోట విజయసాగర్ సమీక్షించారు. వక్తలు మాట్లాడుతూ.. రామబ్రహ్మం రచించిన ఈ పుస్తకాల్లో సమాజానికి ఉపయోగపడే విషయాలున్నాయన్నారు. ప్రస్తుతం సాగుతున్న అవినీతి, అరాచకాలను ఎండగట్టారన్నారు. వాటికి దూరంగా ఉన్నతంగా ఎలా ఎదగాలి, గొప్పగా ఎలా రాణించాలి తదితర విషయాలను వివరించారన్నారు. భక్తి సుధా గ్రంథంలో భక్తి కులమతాలకు అతీతంగా ఉండాలనీ, అందరికీ దేవుడు ఒక్కడేనని తదితర విషయాలను వివరించారన్నారు. అనంతరం గ్రంథాన్ని వక్తలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు జాబిలి చాంద్ బాషా, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు నాగరాజు, సుధాకర్ గుప్తా, కోగిర జయచంద్ర పాల్గొన్నారు.


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వక్తలు

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి

ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రఘునాథరెడ్డి

కొత్తచెరువు, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రఘునాథరెడ్డి డిమాండ్ చేశారు. పుట్టపర్తి మండలం బీడుపల్లి ఉన్నతపాఠశాలలో ఎస్టీయూ వార్షిక కౌన్సిల్ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన రఘునాథరెడ్డి మాట్లాడుతూ.. 12వ పీఆర్సీ కమిషన్ నియమించి, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా 30 శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలన్నారు. సీపీఎస్, జీపీఎస్‌లను రద్దుచేసి, పాత పెన్షన్‌విధానాన్ని కొనసాగించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న రూ.25వేల కోట్ల బకాయిలను వెంటనే మంజూరు చేయాలనీ, ఏకీకృత సర్వీసు రూల్స్ సమస్యలను పరిష్కరించాలన్నారు. 1998-2008 ఎంపీఎస్ ఉపాధ్యాయుల ఉద్యోగ విరమణ వయసు 62 సంవత్సరాలకు పెంచాలనీ, దశల వారీగా వారిని రెగ్యులర్ చేయాలన్నారు. 2003 డీఎస్సీ అభ్యర్థులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా, రాష్ట్రస్థాయిలో ఉత్తమ అవార్డులు పొందిన ఉపాధ్యాయులను ఎస్టీయూ ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్ రెడ్డి, ఆ సంఘం నేత గోపాల్ నాయక్, సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్య, సీనియర్ నాయకులు ప్రసాద్, వెంకటేశ్వర్లు, పాల్గొన్నారు.




మాట్లాడుతున్న ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రఘునాథరెడ్డి


రేపు ఆంక్షలు

జిల్లాలో 30 పోలీసు యాక్టు
నిబంధనల మేరకే నూతన సంవత్సర వేడుకలు చేసుకోవాలి: ఎస్పీ



పుట్టపర్తిరూరల్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరాది వేడుకల వేళ ఈనెల 31న పోలీసు ఆంక్షలు అమలులో ఉంటాయని ఎస్పీ రత్న ఆదివారం ప్రకటనలో తెలిపారు. జిల్లాలో నూతన సంవత్సర వేడుకలు ప్రశాంతంగా చేసుకోవాలని ప్రజలకు సూచించారు. జిల్లాలో 30 పోలీసు యాక్టు అమలులో ఉంటుందన్నారు. పోలీసు ఆంక్షలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. బహిరంగ ప్రదేశాలు, రోడ్లపై వేడుకలకు అనుమతులు లేవన్నారు. రాత్రి 10 గంటల తర్వాత పోలీసులు వాహన తనిఖీలు చేపడతారనీ, అత్యవసరమైతే తప్ప.. బయటకు రావద్దని ఎస్పీ సూచించారు. జిల్లాలోని అన్ని పోలీసు స్టేషన్ల పరిధిలోని ముఖ్యమైన జంక్షన్లలో పికెటింగ్ ఏర్పాటు చేస్తామన్నారు. మద్యం దుకాణాలు నిర్ణీత సమయంలో మూసివేయాలన్నారు. బైక్‌రేసులు, ర్యాష్ డ్రైవింగ్, ద్విచక్రవాహనాలకు సైలెన్సర్లు తీసేసి, అధిక శబ్దాలతో నడపడం నిషేధమన్నారు. నూతన సంవత్సర వేడుకల విషయంలో పిల్లల పట్ల తల్లితండ్రులు జాగ్రత్తగా ఉండాలని ఎస్పీ హెచ్చరికలు జారీ చేశారు.








గత ప్రభుత్వం నీరు ఇవ్వకపోవడంతో చెర్లోపల్లి రిజర్వాయర్‌లో అరకొరగా ఉన్న నీరు


కూటమి ప్రభుత్వంలో నీటితో కళకళలాడుతున్న చెర్లోపల్లి రిజర్వాయర్

పునరుజ్జీవం!

ఉమ్మడి జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులకు మహర్దశ

- హెచ్చెల్సీ, హంద్రీనీవా అభివృద్ధికి రూ.కోట్ల నిధులు
- ఎన్నికలతో సాగునీటి సంఘాలకు జవసత్వాలు
- ప్రతి ఎకరాకు నీరు ఇవ్వడానికి కూటమి సర్కారు యత్నం
- వైసీపీ పాలనలో కుదేలైన సాగునీటి రంగం

ప్రతిపాదనలకే పరిమితమైన డిస్ట్రిబ్యూటరీల నిర్మాణం




హంద్రీనీవా సుజల స్రవంతి పథకం కింద ఉమ్మడి జిల్లాలో 3.45 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు రూ.1200 కోట్లతో డిస్ట్రిబ్యూటరీల నిర్మాణాలకు పంపిన ప్రతిపాదనలు అలాగే ఉండిపోయాయి. గత ఐదేళ్లలో హంద్రీనీవా ఇంజనీర్లు మూడు దఫాలుగా ప్రతిపాదనలు పంపినా ప్రభుత్వం స్పందించలేదు. ఉరవకొండ ప్రాంతంలో గత టీడీపీ ప్రభుత్వం 38వేల ఎకరాలకు సంబంధించి ప్రారంభించిన పనులను వైసీపీ ప్రభుత్వం గాలికొదిలేసింది. అర్ధంతరంగా డిస్ట్రిబ్యూటరీల నిర్మాణ పనులు నిలిపివేయడంతో పిల్లకాలువల పనులు ఎక్కడికక్కడ ఆగిపోయాయి.

అటకెక్కిన సామూహిక బిందుసేద్యం

హంద్రీనీవా ద్వారా సాగునీరు అందని పొలాలకు నీటి సదుపాయం కల్పించడానికి గత టీడీపీ ప్రభుత్వం సామూహిక బిందు సేద్యం (సీఎల్‌డీఐ) పథకాన్ని తీసుకువచ్చింది. రూ.840కోట్లతో 2017లో పనులకు శ్రీకారం చుట్టింది. తక్కువ నీటితో అధిక పంటలు పండించేలా రైతులను ప్రోత్సహించేందుకు కేంద్రప్రభుత్వం ప్రధానమంత్రి కిసాన్ సంరక్షణ యోజన కింద సుమారు రూ.271కోట్లు నిధులు చెల్లిస్తామని అప్పట్లో చెప్పింది. ఉరవకొండ ప్రాంతంలోని బెళుగుప్ప, కూడేరు, ఉరవకొండ మండలాల్లో సుమారు 50వేల ఎకరాలకు సాగునీరు అందించేందుకు సీఎల్‌డీఐ తీసుకువచ్చారు. అయితే వైసీపీ ప్రభుత్వం 2019లో పథకాన్ని పూర్తిగా రద్దు చేసింది. ఇందుకు సంబంధించి పరికరాలు మూలనపడేశారు.

బీటీపీ, పేరూరు ప్రాజెక్టులకు నిధులు చెల్లించేందుకు సీఎం చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారు. 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వం బీటీపీ, పేరూరు ప్రాజెక్టు పనులను ఆమోదిస్తూ నిధులు కేటాయించింది. అయితే 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ రెండు ప్రాజెక్టులను పూర్తిగా విస్మరించింది. భైరవానితిప్ప ప్రాజెక్టుకు జీడిపల్లి రిజర్వాయర్ నుంచి హంద్రీనీవా నీటిని తరలించేందుకు 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వం రూ.541కోట్లు నిధులు కేటాయించింది. అయితే వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల ముందుకు సాగలేదు. అదే జీడిపల్లి రిజర్వాయర్ నుంచి పేరూరు డ్యాంకు నీళ్లు తరలించేందుకు అప్పర్ పెన్నా ప్రాజెక్టుకు రూ.591కోట్లతో పనులు చేపట్టారు. 53కిలోమీటర్ల కాలువ పనులతో పాటు సోమరవాండ్లపల్లి, పుట్టకనుమ తగరకుంట వద్ద రెండు జలాశయాలు నిర్మించాలని పనులు చేపట్టారు. అప్పటి టీడీపీ హయాంలో చేసిన రూ.164కోట్లు పనులకుగాను వైసీపీ ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న రూ.100కోట్లకు పైగా బిల్లులు చెల్లించలేదు.


బిల్లులు చెల్లించని వైసీపీ సర్కార్



> వైసీపీ పాలనలో కుదేలైన సాగునీటి రంగం పునరుజ్జీవానికి కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఎన్నికల గిమ్మిక్కులతో వైసీపీ ప్రభుత్వం హడావుడి చేసింది తప్ప ప్రాజెక్టుల అభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకోలేదు. అయితే కూటమి సర్కారు కొలువు దీరిన తర్వాత ఉమ్మడి జిల్లా సాగు, తాగునీటి అవసరాలను తీర్చే హెచ్చెల్సీ, హంద్రీనీవా అభివృద్ధి, మరమ్మతులకు రూ.కోట్ల నిధులు విడుదల చేసింది. వైసీపీ పాలనలో గ్రహణం పట్టిన ప్రాజెక్టుల అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ ఇచ్చారు. వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఆగిపోయిన సాగు నీటి ప్రాజెక్టుల పనులను పునఃప్రారంభించాలని కూటమి సర్కారు నిర్ణయించింది. కాలువల వెడల్పు, మరమ్మతులు, ముళ్ల పొదలు తొలగించడానికి నిధులు కేటాయించింది. బీటీపీ, పీఏబీఆర్ పనులను వేగంగా పూర్తి చేస్తామని ఇటీవల జిల్లాలో పర్యటించిన సందర్భంలో సీఎం ప్రకటించారు. ఐదేళ్ల కాలంలో పడకేసిన సాగునీటి పనులపై నిధుల వరద పారించి, త్వరగా పూర్తి చేయడానికి కూటమి ప్రభుత్వం కృతనిశ్చయంతో ప్రయత్నిస్తోంది. ఈక్రమంలోనే ఎన్నికలు నిర్వహించి సాగునీటి సంఘాలకు జవసత్వాలు కల్పించింది.

అనంతపురం క్లాక్‌టవర్/పుట్టపర్తి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): రైతు ప్రభుత్వంగా చెప్పుకుంటూ, గత ఐదేళ్లగా రైతులకు ఎటువంటి మేలు చేయని వైసీపీ ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులపై శీతకన్ను వేసింది. జిల్లాలోని హెచ్చెల్సీ, హంద్రీనీవా ప్రాజెక్టుల అభివృద్ధికి ఎటువంటి చర్యలు తీసుకోలేదు. అయితే ఆరు నెలల కిందట ఏర్పడిన కూటమి ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టుల ప్రాధాన్యాన్ని గుర్తించి, అవసరమైన నిధులు విడుదల చేస్తోంది. బీటీపీ, పేరూరు ప్రాజెక్టుల అభివృద్ధికి నిధులు ఇస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకటించారు. హంద్రీనీవా ఫేజ్-2 కింద 2016 కిలోమీటర్ జీడిపల్లి నుంచి కదిరి దగ్గర 400కిలోమీటరు వరకు సుమారు 190కిలోమీటర్ల వరకు సిమెంట్ కాంక్రీట్ లైనింగ్ చేయడానికి రూ.936కోట్లు కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అదే విధంగా హెచ్చెల్సీ కింద అత్యవసరమైన 11పనుల మరమ్మతులకు, నిర్మాణాలకు రూ.36కోట్లు మంజూరు చేశారు. దీనికి సంబంధించి ఇప్పటికే టెండర్లు కూడా పిలిచారు. జనవరి లేదా ఫిబ్రవరిలో పనులు చేపట్టేందుకు హెచ్చెల్సీ ఇంజనీర్లు కసరత్తు చేస్తున్నారు.





చంద్రబాబు హామీ

జీడిపల్లి నుంచి భైరవానితిప్ప ప్రాజెక్టుకు కృష్ణా జలాలు తరలించేందుకు కాలవ నిర్మాణం, భూసేకరణ పూర్తి చేయడానికి రూ.500కోట్లు చెల్లించేందుకు సీఎం చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారు. జీడిపల్లి నుంచి పేరూరు ప్రాజెక్టుకు కృష్ణా జలాలు తరలించేందుకు భూసేకరణ, కాలవ నిర్మాణానికి రూ.350కోట్లు చెల్లిస్తామని జిల్లా పర్యటనలో ప్రకటించారు. మైనర్ ఇరిగేషన్ పరిధిలోని పేరూరు ప్రాజెక్ట్, భైరవానితిప్ప ప్రాజెక్ట్ (బీటీపీ)ల గేట్లు, మరమ్మతులకు, గుర్తించిన పలు చెరువుల మరమ్మతులు, గండ్లు పూడ్చేందుకు సంబంధించి ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం రూ.5 కోట్లు నిధులు మంజూరు చేసింది. గత వైసీపీ ప్రభుత్వంలో నిర్వీర్యమైన జలవనరుల శాఖకు కూటమి ప్రభుత్వం నిధుల వరద పారిస్తోంది.

హెచ్చెల్సీలో అత్యవసర 11పనులకు రూ.36కోట్లు మంజూరు

హెచ్చెల్సీకి అత్యంత ప్రాధాన్యత కింద 11పనులను చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు అవసరమైన రూ.36కోట్లు నిధులను మంజూరు చేసింది. ప్రధానంగా హెచ్ఎల్ఎంసీ 165.028 కిలోమీటర్ వద్ద నిలిచిపోయిన బ్రిడ్జిని పూర్తి చేయడానికి రూ.1.59కోట్లు కేటాయించారు. 169.400కిలోమీటర్ వద్ద వంతెన నిర్మాణానికి రూ.1.91కోట్లు మంజూరు చేశారు. 155.81కిలోమీటర్ వద్ద అసంపూర్తిగా ఉన్న వంతెన నిర్మాణానికి రూ.1.53కోట్లు కేటాయించారు. 115.167కిలోమీటర్ వద్ద వంతెన పూర్తి చేయడానికి రూ.1.66కోట్లు కేటాయించారు. 117.794కిలోమీటర్ వద్ద బ్రిడ్జి నిర్మాణానికి రూ.1.80కోట్లు కేటాయించారు. 147.395కిలోమీటర్ వద్ద పెండింగ్‌లో ఉన్న అవుట్‌పాల్ రెగ్యులేటర్ పూర్తి చేయడానికి రూ.4.21కోట్లు కేటాయించారు. 137.702కిలోమీటర్ వద్ద అండర్ టన్నెల్ పునర్నిర్మాణానికి రూ.4.21కోట్లు మంజూరు చేశారు. 189.126 కిలోమీటర్ వద్ద పీఏబీఆర్ లింకుచానల్ పునర్ నిర్మాణానికి రూ.4.10కోట్లు కేటాయించారు. 189.126 కిలోమీటర్ వద్ద ఎంపీఆర్ రెగ్యులేటర్ ఓటీ మోపిడి వద్ద రెగ్యులర్ నిర్మాణానికి రూ.4.14కోట్లు మంజూరు చేశారు. 115 కిలోమీటర్ నుంచి 130కిలోమీటర్ వరకు లైనింగ్ నిర్మాణానికి రూ.9.80కోట్లు వేయడానికి కేటాయించారు. కణేకల్లు చెరువు ఒకటో కిలోమీటర్ వద్ద ఆఫ్‌టెక్ స్లూయిస్-3 నిర్మాణానికి రూ.22లక్షలు కేటాయించారు. కాగా పీఏబీఆర్‌లో పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 11 టీఎంసీలు ఉంచడానికి అవసరమైన పనులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. ఇందుకోసం దాదాపు రూ.450 కోట్లకు పైగా నిధుల అవసరం ఉన్నట్లు సాగునీటి రంగ ఇంజనీర్లు స్పష్టం చేస్తున్నారు.

శ్రీసత్యసాయి జిల్లాలో..

శ్రీసత్యసాయి జిల్లాకు వరప్రదాయిని అయిన హంద్రీనీవా కాలువ వెడల్పు, ముళ్ల పొదల తొలగింపు పనుల గురించి గత వైసీపీ ప్రభుత్వం అస్సలు పట్టించుకోలేదు. వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం, ముందుచూపులేకపోవడం జిల్లా రైతాంగానికి శాపంగా మారింది. ఎన్నికల్లో లబ్ధి పొందడానికి కుప్పానికి జీడీపల్లి రిజర్వాయర్ నుంచి పుంగనూరు కాలువ ద్వారా కృష్ణా నీళ్లు తరలించారు. అందుకోసం మడకశిర, పుంగనూరు ఉపకాలువ కింద రిజర్వాయర్లు, గొల్లపల్లి, బుక్కపట్నం మండలంలోని మారాల, కదిరి మండలం చెర్లోపల్లి జలాశయాలకు నీరు ఇవ్వకుండా ఎండబెట్టారు. దీంతో ఆయకట్టు భూములు బీళ్లుగా మారాయి. అయితే ఆరు నెలల కిందట సీఎంగా చంద్రబాబు బాధ్యతలు చేపట్టాక సాగునీటి ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి పెట్టారు. గత వైసీపీ ప్రభుత్వం ఆపేసిన సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేయడంతో పాటు కొత్త ప్రాజెక్టులను నిర్మించి, ప్రతి ఎకరాకు సాగు నీరు ఇవ్వాలన్న సంకల్పంతో బడ్జెట్‌లో నిధులు కేటాయించారు.

> గత వైసీపీ ప్రభుత్వంలో నిరాదరణకు గురైన సాగునీటి సంఘాలకు జవసత్వాలు తెచ్చేదిశగా కూటమి ప్రభుత్వం యత్నిస్తోంది. ఈక్రమంలోనే ఇటీవల సాగునీటి సంఘాలకు ఎన్నికలు కూడా నిర్వహించింది.

సాగునీటి సంఘాల ఏర్పాటు

గత ప్రభుత్వం సాగు నీటి సంఘాలను ఏర్పాటు చేయక పోవడంతో చెరువుల్లో పూడికతీత, మరమ్మతులు, కాలువ గట్ల బలోపేతం వంటి ముఖ్యమైన పనులు నిలిపోయాయి. కూటమి ప్రభుత్వం సాగునీటి సంఘాల ఆవశ్యకతను గుర్తించి, నూతన కార్యవర్గాలను ఏర్పాటు చేసింది. దీంతో క్షేత్రస్థాయిలో నీటి ప్రాజెక్టుల బాగోగులు చూసుకునేవారిని నియమించినట్లు అయ్యింది.

ఎన్నికల వేళ డ్రామా....

పుట్టపర్తి నియోజకవర్గంలో 193 చెరువులకు నీరుఇవ్వాలని రాయలసీమ కరవు నివారణ పథకం కింద 2021 జనవరిలో రూ. 864.18 కోట్లతో ఎత్తిపోతల పథకం ప్రారంభించారు. అదే ఏడాది మేలో అప్పటి సీఎం జగన్‌తో శంకుస్థాపన చేశారు. 2022 డిసెంబరు నాటికి తొలి విడతగా పుట్టపర్తి, బుక్కపట్నం మండలాల్లోని అన్ని చెరువులకు నీరు ఇస్తామని ప్రకటించారు. ఇందుకోసం 2021లోనే టెండర్ నోటిఫికేషన్ ఇచ్చి 2022 ఫిబ్రవరిలో ప్రక్రియ పూర్తి చేశారు. పనులను పుట్టపర్తి మాజీ ఎమ్మెల్యేకి చెందిన ఏఎస్ఆర్, ఎస్‌సీఎల్ కాంట్రాక్టు కంపెనీకి రూ. 735 కోట్లకు అప్పగించారు. 36 నెలల్లో పనులు పూర్తి చేయాలన్న నిబంధన విధించినా రెండేళ్లు ఉలుకూ, పలుకు లేకుండాపోయింది. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో జనవరి19న నల్లగొండ రిజర్వాయర్ పనులకు ఎమ్మెల్యే, ఎంపీలు శంకుస్థాపన చేశారు. ఈప్రాజెక్టు కోసం 1200 ఎకరాల భూమిని సేకరించాల్సి ఉన్నా కేవలం నల్లగొండ, గాజులపల్లి రిజర్వాయర్ల ముంపునకు గురయ్యే భూములను గుర్తించి నోటిఫికేషన్ జారీ చేశారు. అయితే భూనిర్వాసితులకు పైసా నిధులు ఇవ్వలేదు. ఇదంతా ఎన్నికల డ్రామాగా గుర్తించిన ప్రజలు వైసీపీకి ఓటుతో గుణపాఠం చెప్పారు.


గత వైసీపీ ప్రభుత్వంలో నీరు ఇవ్వకుండా ఎండబెట్టిన మడకశిర ఉపకాలువ


కూటమి ప్రభుత్వం రాకతో నిధుల గలగల


గత వైసీపీ ప్రభుత్వం హంద్రీనీవా ప్రధాన కాలువతో పాటు మడకశిర ఉప కాలువ వెడల్పు పనులు చేయడానికి హడావిడి చేసిందే తప్ప పైసా నిధులు విడుదల చేయలేదు. కూటమి ప్రభుత్వం కొలువుదీరిన కొన్ని రోజుల్లోనే సాగు నీటి ప్రాజెక్టులపై కదలిక తీసుకువచ్చింది. హంద్రీనీవా సుజల స్రవంతి ప్రాజెక్టు ద్వారా కృష్ణాజలాలు పూర్తి స్థాయిలో అందించేలా చర్యలు చేపట్టింది. జీడిపల్లి రిజర్వాయర్ నుంచి ప్రధాన కాలువ లైనింగ్ పనుల కోసం రూ. 57.80 కోట్లు కేటాయించింది. 285.100 కి.మీ నుంచి 287.100 కి.మీ టన్నెల్ ఏర్పాటుకు కోసం రూ.36.19 కోట్లు మంజూరు చేసింది. 300కి.మీ నుంచి 320 కి.మీ వరకు పెండింగ్‌లో ఉన్నా పనులకు (చెన్నేకొత్తపల్లి మండలంలో) రూ. 108.32 కోట్లు కేటాయించింది. 320కి.మీ నుంచి 340కి.మీ వరకురూ. 61.04 కోట్లు, 340కి.మీ నుంచి 356 కి.మీ వరకు పెండింగ్ పనులతో పాటు ప్రధాన కాలువ ఆధునికీకరణకు రూ.119.35 కోట్ల నిధులు మంజూరు చేసింది.

358. 150కి.మీ నుంచి 360.250 కి.మీ వరకు టన్నెల్ పెండింగ్ పనుల ఇతరత్ర నిర్మాణాలకు (బుక్కపట్నం) మండల పరిధిలో రూ.55.40 కోట్లు, 360.400 కి.మీ నుంచి 380.150 కి.మీ వరకు పెండింగ్ పనుల పూర్తి కోసం రూ. 161.60 కోట్లు, 380 కి.మీ నుంచి 400 కి.మీ వరకు (ముదిగుబ్బ మండలం పరిధిలో)పెండింగ్ పనులకు రూ.79.60 కోట్ల నిధులు మంజూరు చేశారు. మడకశిరలో రత్నగిరి, రాళ్లపల్లి రిజర్వాయర్ల డీపీఆర్ కోసం కూటమి ప్రభుత్వం రూ. 37 లక్షలు మంజూరు చేసింది.

మడకశిర ఉప కాలువ విస్తరణకు రూ.250 కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ప్రారంభించిన, ప్రతిపాదిత పనులు పూర్తయితే జిల్లాకు మళ్లీ నీటి కళ వస్తుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.


ఇటీవల తలుపుల, నంబులపూలకుంట కాలువకు నీటిని విడుదల చేసిన దృశ్యం


వైసీపీ పాలనలో అరకొర నీటితో గొల్లపల్లి రిజర్వాయర్


హంద్రీనీవా ఎత్తిపోతల పథకం


వైసీపీ పాలనలో తలుపుల, నంబులపూలకుంట మండలాలకు వెళ్లే హంద్రీనీవా ప్రధాన కాలువకు నీరు ఇవ్వకుండా ఎండబెట్టిన దృశ్యం


ముదిగుబ్బ మండలం నాగిరెడ్డిపల్లి నుంచి విడుదలై హంద్రీనీవా కాలువలో పారుతున్న నీరు

డీఎస్సీ ఎస్జీటీ టాలెంట్ టెస్టుకు స్పందన


పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న డైట్ కళాశాల అధ్యాపకుడు రామకృష్ణ

కొత్తచెరువు, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): వదాన్య ఫౌండేషన్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా డీఎస్సీ ఎస్జీటీ అభ్యర్థులకు నిర్వహించిన టాలెంట్ టెస్టుకు విశేష స్పందన లభించింది. ప్రభుత్వం త్వరలో డీఎస్సీని నిర్వహిస్తుండటంతో అభ్యర్థుల ప్రజ్ఞను వెలికితీసేందుకు వదాన్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో డీఎస్సీ ఎస్జీటీ అభ్యర్థుల కోసం మండల కేంద్రంలో ఆదివారం పరీక్షను నిర్వహించారు. ఈ టెస్టుకు 1100 మంది అభ్యర్థులు హాజరయ్యారు. పరీక్షా కేంద్రాలను బుక్కపట్నం డైట్ కళాశాల అధ్యాపకులు రామకృష్ణ పరిశీలించారు. జనవరి 15న ఫలితాలను విడుదల చేస్తామని ఫౌండేషన్ నిర్వాహకులు అశోక్ పడపాటి తెలిపారు. మండల కేంద్రంలో ఐదు పరీక్షా కేంద్రాలలో అభ్యర్థులు పరీక్షలు రాయగా వారికి ఎలాంటి అసౌకర్యాలు కల్గకుండా అన్ని వసతులు కల్పించారు. ఈ కేంద్రాలను సీఐ ఇందిర తనిఖీ చేశారు.

అనారోగ్యంతో ఎస్ఐ మృతి

తాడిపత్రి, డిసెంబరు29(ఆంధ్రజ్యోతి): పట్టణ ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న నాగవీరయ్య (60) అనారోగ్యంతో ఆదివారం తెల్లవారుజామున మృతిచెందారు. నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల గ్రామానికి చెందిన నాగవీరయ్య 1987లో కానిస్టేబుల్‌గా పోలీసుశాఖలో విధుల్లో చేశారు. హెడ్‌కానిస్టేబుల్, ఏఎస్ఐగా వివిధ ప్రాంతాల్లో పనిచేశారు. 2021లో ఉద్యోగోన్నతిపై తాడిపత్రి ఎస్ఐగా బాధ్యతలు చేపట్టారు. నాలుగు రోజుల క్రితం ఆయన సొమ్మసిల్లి పడిపోవడంతో అనంతపురంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. ఆదివారం తెల్లవారుజామున ఆరోగ్యం విషమించి, ఆయన మరణించారు. తాడిపత్రికి తరలించి, పోలీసు లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. ఎస్ఐకి భార్య సరోజ, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.


నాగవీరయ్య(ఫైల్)

రైల్వే జీఎం అవార్డుకు ఇద్దరు ఉద్యోగుల ఎంపిక


మనోజ్‌కుమార్


మల్లికార్జున

గుత్తి, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): గుత్తి రైల్వే డీజిల్ షెడ్‌లో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు ఉద్యోగులు దక్షిణ మధ్య రైల్వే జీఎం అవార్డుకు ఎంపికయ్యారు. డీజిల్ షెడ్‌లో పనిచేస్తున్న ఆఫీసు సూపరింటెండెంట్ మల్లికార్జున, సీనియర్ సెక్షన్ ఇంజనీర్ మనోజ్‌కుమార్ ఎంపికైన వారిలో ఉన్నారు. జనవరి 3న సికింద్రాబాదులో రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్ చేతుల మీదుగా వీరు అవార్డు అందుకోనున్నారు. స్థానిక డీజిల్ షెడ్‌లో పనిచేస్తున్న మల్లికార్జున 2001లో అసిస్టెంట్ లోకో పైలెట్‌గా ఉద్యోగంలో చేరాడు. 2006 ఏప్రిల్ 9న జరిగిన రైలు ప్రమాదంలో రెండు కాళ్లను కోల్పోయాడు. దీంతో రైల్వే శాఖ 2009లో గుత్తిడీజిల్ షెడ్‌లో జూనియర్ క్లర్క్ ఉద్యోగం ఇచ్చింది. అప్పటి నుంచి విధులను నిబద్ధతతో నిర్వహిస్తూ 2014, 17 సంవత్సరాల్లో రైల్వే సేవా అవార్డులను అందుకున్నాడు. తిరిగి 2024-25 ఏడాదికి సంబంధించి దక్షిణ మధ్య రైల్వే జీఎం అవార్డుకు ఎంపికయ్యాడు. మనోజ్‌కుమార్ డీజిల్ షెడ్‌లో సీనియర్ సెక్షన్ ఇంజనీర్, ఎలక్ట్రికల్ డీజిల్ లోకో షెడ్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. ఈయన ఎలక్ట్రికల్ లోకోలకు ఉపయోగించే కార్డ్ టెస్టింగ్ స్టాండ్‌ను కనుగొన్నాడు. ఈ కార్డ్ వల్ల ఎలక్ట్రికల్ లోకోలో మరమ్మతులు తగ్గే అవకాశం ఉందన్నారు. దీంతో ఈయన జీఎం అవార్డుకు ఎంపికయ్యాడు. వీరి ఎంపిక పట్ల సీనియర్ డీఎంఈ ప్రమోద్, సెక్షన్ ఇంజనీర్లు, కార్మికులు, కార్మిక సంఘనాయకులు హర్షం వ్యక్తం చేశారు.

జీవిత సంఘర్షణలను ఆవిష్కరించిన సీమ సాహిత్యం

కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత రాచపాళెం



మాట్లాడుతున్న కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత ఆచార్య రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి

అనంతపురం కల్చరల్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ ప్రాంతం నుంచి వెలువడిన సాహిత్యం జీవన సంఘర్షణలను ఆవిష్కరించిందని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత ఆచార్య రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. సాహిత్య అకాడమీ, విమలాశాంతి సాంస్కృతిక సేవాసమితి సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఎన్జీఓ హోంలో 'రాయలసీమ సాహిత్యం-బహుజన జీవితం' అనే అంశంపై నిర్వహించిన సదస్సులో ఆచార్య రాచపాళెం ప్రసంగించారు. రాయలసీమ నుంచి బహుజన జీవితం ఇంకా రావాల్సిన అవసరముందని అభిప్రాయం వ్యక్తం చేశారు. కేంద్ర సాహిత్య అకాడమీ సాహిత్య ప్రచారంకోసం నిర్వహించే కార్యక్రమాల గురించి వివరించారు. విమలాశాంతి సాంస్కృతిక సేవాసమితి వ్యవస్థాపకుడు డాక్టర్ శాంతినారాయణ మాట్లాడుతూ సాహిత్య అకాడమీ చేపడుతున్న సాహిత్య కార్యక్రమాలు ఎంతో విలువైనవని, కవులు, రచయితలు, సాహిత్య సంస్థలు ముందుకు వచ్చి అనేక కార్యక్రమాలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో సాహితీవేత్తలు డాక్టర్ భావికాటి రాఘవేంద్ర, అంకె శ్రీనివాస్, కొత్తపల్లి సురేష్, ఆచార్య వంకిరెడ్డి రెడ్డప్పరెడ్డి, ఎస్ఎం బాషా, గోవిందరాజులు, వన్నప్ప, డాక్టర్ నానీల నాగేంద్ర, తూముచెర్ల రాజారాం, గోసల నారాయణస్వామి, చేగువేరా హరి, జూటూరు షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

అదనపు సీట్లు కేటాయించండి

నసనకోట పాఠశాలను అప్‌గ్రేడ్ చేయండి: గురుకుల పాఠశాలల కార్యదర్శిని కోరిన ఎమ్మెల్యే పరిటాల సునీత


గురుకుల పాఠశాలల కార్యదర్శితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

రామగిరి, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): రాప్తాడు నియోజకవర్గంలోని గురుకుల పాఠశాలల్లో వచ్చే ఏడాది నుంచి ప్రతి తరగతికి అదనపు సీట్లు కేటాయించాలని ఎమ్మెల్యే పరిటాల సునీత గురుకుల పాఠశాలల కార్యదర్శి కృష్ణమోహన్‌ను కోరారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎంజేపీ గురుకులపాఠశాలల కార్యదర్శి కృష్ణమోహన్ జిల్లా పర్యటనలో భాగంగా ఆదివారం పేరూరు, నసనకోట పాఠశాలల పరిశీలనకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన వెంకటాపురంలో ఎమ్మెల్యే పరిటాల సునీతను మర్యాదపూర్వకంగా కలిశారు. గురుకుల పాఠశాలల పరిస్థితి గురించి చర్చించారు. రామగిరి ప్రాంతం అత్యంత వెనుకబడినదని, ఇందులో కూలీలు అధికంగా ఉన్నారని, వీరి పిల్లలను దూరంగా వెళ్లి చదివించే పరిస్థితి లేదని ఆమె తెలిపారు. పేరూరు, నసనకోట ఎంజేపీ గురుకుల పాఠశాలపై ఆధారపడి ఉన్నారన్నారు. తగినన్ని సీట్లు లేక పేద విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని, వచ్చే ఏడాది నుంచి అదనపు సీట్లు, తరగతులు కేటాయించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. నసనకోట ఎంజేపీ గురుకుల పాఠశాలను ఇంటర్‌కు అప్‌గ్రేడ్ చేయాలని కోరారు. చాలామంది బాలికలు 10వ తరగతి తరువాత దూరప్రాంతాలకు వెళ్లలేక మధ్యలోనే చదువును ఆపేస్తున్నారని తెలిపారు. వీటిపై ఇప్పటికే సంబంధిత మంత్రికి వినతిపత్రం ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఎమ్మెల్యే పరిటాల సునీత చెప్పిన అన్ని అంశాలకు కార్యదర్శి సానుకూలంగా స్పందించారు. పరిశీలించి మంజూరుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

1.681 టీఎంసీల నీటి నిల్వ



బెళుగుప్ప, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి) : మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌లో ప్రస్తుతం నీటి నిల్వ 1.681 టీఎంసీలు ఉన్నట్లు హంద్రీనీవా అధికారులు ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఇన్‌ఫ్లో 802 క్యూసెక్కులుండగా.. ఔట్‌ఫ్లో కింద హెచ్ఎన్ఎస్ఎస్ ఫేజ్-2కు 177 క్యూసెక్కుల నీరు వెళుతున్నట్లు వారు పేర్కొన్నారు.

టమోటా రైతు కుదేలు..!

● దిగుబడి ఉన్నా.. ధరలు లేక నష్టాలు
● మనసు చంపుకుని కాయలు తొలగిస్తున్న రైతులు

ఓబుళదేవరచెరువు, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): టమోటా రైతుకు కష్టాలు తప్పడం లేదు. ఆశించిన స్థాయిలో దిగుబడి ఉన్నా, ధరలు లేకపోవడంతో వారి కష్టం వృథా అవుతోంది. గతంలో టమోటాకు మంచి ధర ఉండడంతో రైతులు వ్యయప్రయాసాలుపడి అప్పులు చేసి పంటలు సాగుచేశారు. ప్రస్తుతం ధరలు లేకపోవడంతో రైతు పడిన వృథా అవుతోంది. మండల వ్యాప్తంగా 210 ఎకరాల్లో టమోటా పంటను సాగుచేశారు. ధరలు లేకపోవడంతో పొలాల్లోనే కాయలను తొలగించాల్సిన దుస్థితి ఏర్పడింది. ఎకరా టమోటా సాగు చేయాలంటే రూ.లక్ష పైమాటే. ప్రధానంగా కాయలు తొలగించేందుకు కష్టతరమవుతోంది. కూలీలు దొరక్క పొరుగు ప్రాంతాల నుంచి కూలీలను రప్పించి తొలగించాల్సిన పరిస్థితి నెలకొంది. తీరా మార్కెట్‌కు వెళితే ధరలు లేక కాయలను రోడ్డుపై పారబోయలేక అయినకాడికి అమ్ముకుని వెనుదిరగాల్సిన పరిస్థితి లేకపోలేదు. ప్రస్తుతం మదనపల్లి మార్కెట్‌లో 35 కిలోల టమోటా బాక్స్ రూ.120 నుంచి 160 దాకా పలుకుతోంది. కర్ణాటక రాష్ట్రం కోలార్‌లో కూడా ఇవే ధరలుండడంతో రైతులు పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.


టమోటా కాయలను గ్రేడింగ్ చేస్తున్న కూలీలు

కోస్తే మోత.. వదిలేస్తే గుండెకోత..

రైతులు సాగుచేసిన టమోటా కాయలు కోసేందుకు భారమవుతోంది. అలాగే వదిలేస్తే గుండెకోత మిగులుతోంది. టమోటా కొనుగోలు చేయడానికి వినియోగదారులు కొన్ని నెలలక్రితం బెంబేలెత్తిపోయారు. ప్రస్తుతం ధరలు పడిపోవడంతో కొనేవారే కరువయ్యారు. పెట్టిన పెట్టుబడి రవాణా, కోత ఖర్చులు కూడా తిరిగిరాని పరిస్థితి నెలకొంది. ఎకరా సాగుకు రూ.లక్ష నుంచి లక్ష 20వేలు ఖర్చు చేయాల్సి వస్తోంది. పైరు, కట్టెలు, కూలీలు, ఇతర ఎరువులు, డ్రిప్‌లకోసం రైతులు వ్యయం చేయాల్సిందే. పంట దిగుబడి ఆశాజనంగా ఉన్నా ధరలు లేకపోవడంతో రైతులు విలవిల్లాడుతున్నారు. చూస్తూ చూస్తూ కాయలను పొలాల్లో వదిలేయలేక, ఖర్చు భారమైనా కాయలు కోస్తున్నారు.

కూలీల కొరత తీవ్రం

ప్రస్తుతం ఏ పంట సాగుచేసినా కూలీల కొరత రైతులను వెంటాడుతోంది. ప్రస్తుతం టమోటా పంటపై చాలమంది రైతులు దృష్టి సారించడంతో కాయల కోతకు కూలీలు దొరకడం లేదు. దీంతో పొరుగు ప్రాంతాలనుంచి రవాణా, భోజన వసతి కల్పించండంతోపాటు ఒక్కో కూలీకి రోజుకు రూ.300 చెల్లించాల్సిన దుస్థితి నెలకొంది. ఇంతకష్టపడి కాయలు తొలగిస్తే రవాణా కోసం ఒక్కో బాక్సుకు రూ.30 చెల్లించాల్సి వస్తోంది. తీరా మార్కెట్‌కు వెళితే కమీషన్ పోను ఖర్చులకు కూడా రాని పరిస్థితి.


తోటలోనే పంటను వదిలేసిన దృశ్యం

గిట్టుబాటు ధర ఏదీ?

గత వైసీపీ ప్రభుత్వం రైతులు సాగుచేసిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పిస్తామని చెప్పినా, అది అమలు కాలేదు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం రైతుల కష్టాలను దృష్టిలో పెట్టుకుని సాగుచేసిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి



ప్రతి ఏడాది రైతులు పంటలు సాగుచేసి నష్టపోతున్నారు. ప్రస్తుతం టమోటా పంట సాగుచేసిన రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. తాను మూడు ఎకరాల్లో టమోటా సాగు చేశా. రూ.4లక్షలు పెట్టుబడి ఖర్చు అయింది. పంట దిగుబడి ఆశాజనకంగా ఉన్నా గిట్టుబాటు ధరలు లేక నష్టపోయా. రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి. **-బూదిలి ఓబులరెడ్డి, రైతు, మల్లాపలి**

సాగుచేసి అప్పులపాలయ్యా



అప్పులు చేసి ఎకరా భూమిలో టమోటా సాగు చేశా. ఎన్నడూ ఊహించని విధంగా దిగుబడి వచ్చింది. అయితే తగిన ధరలు లేకపోవడంతో అప్పులపాలయ్యా. అన్ని ఖర్చుల పోనూ చిల్లిగవ్వకూడా మిగలలేదు. ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకోవాలి.

-వెంకటరమణ, గొరాపురం

న్యూస్ బాక్స్

చెన్నకేశవస్వామి ఆలయ కమిటీ చైర్మన్‌గా జగదీశ్ ప్రసాద్


చైర్మన్ దంపతులను సన్మానిస్తున్న ఈఓ, సిబ్బంది

ధర్మవరం, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయ అడ్‌హక్ కమిటీ చైర్మన్‌గా చెన్నంశెట్టి జగదీశ్ ప్రసాద్ ఎంపికైనట్లు ఆలయ ఈఓ వెంకటేశులు తెలిపారు. ఈఓ, అర్చకులు చైర్మన్ దంపతులకు స్వాగతంపలికి అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు, అర్చనలు చేయించారు. చైర్మన్ మాట్లాడుతూ జనవరి 10న వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లను వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు.

కరాటేలో బెల్ట్ గ్రేడింగ్ టెస్టు


బెల్ట్ గ్రేడింగ్ టెస్టు నిర్వహిస్తున్న మాస్టర్ ఇనాయత్

ధర్మవరం, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కొత్తపేట మున్సిపల్ బాలికల ఉన్నతపాఠశాలలో మల్టీ స్టార్ బుడోఖాన్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం బెల్ట్‌గ్రేడింగ్ టెస్టును నిర్వహించారు. టెస్టులో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు ముఖ్య అతిథులుగా విచ్చేసిన మాంగళ్య శిల్క్స్ యజమాని జింకా పురుషోత్తం, సీనియర్ బ్లాక్ బెల్టర్స్ హస్విక, అబూబకర్ చేతులమీదుగా ఎల్లో, ఆరంజ్, గ్రీన్, బ్లూ, బ్రౌన్ బెల్టులు, ప్రశంసాపత్రాలను అందజేశారు. పురుషోత్తం మాట్లాడుతూ చదువుతోపాటు కరాటేలో కూడా రాణించాలన్నారు. కరాటే నేర్చుకుంటే ఆత్మరక్షణకు ఉపయోగపడుతుందన్నారు.

వైసీపీ మద్దతు సర్పంచ్ బీజేపీలో చేరిక


సర్పంచ్ నాగవేణిని ఆహ్వానిస్తున్న జీఎం శేఖర్

ధర్మవరంరూరల్, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతుకుంట వైసీపీ మద్దతుదారు గ్రామసర్పంచ్ అంగజాల నాగవేణి, ఆమె భర్త వైసీపీ నాయకులు అంగజాల రాజుతో పాటు మరో 30మంది వైసీపీ నాయకులు, కార్యకర్తలు బీజేపీలోకి చేరారు. ఆదివారం పుట్టపర్తిలోని బీజేపీ కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్ వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీబలోపేతానికి కృషి చేయాలని, అండగా ఉంటామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో డోలా రాజారెడ్డి పాల్గొన్నారు.

నూతన సంవత్సర వేడుకలు రాత్రి 12.30 వరకే..: డీఎస్పీ


మాట్లాడుతున్న సీఐ, ఎస్ఐ

కదిరి అర్బన్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సర వేడుకలను 31వ తేదీ రాత్రి 12.3గంటల వరకే జరుపుకోవాలని, నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని డీఎస్పీ శివనారాయణస్వామి పేర్కొన్నారు. ఆదివారం పట్టణ పోలీస్ స్టేషన్‌లో సీఐ నారాయణరెడ్డితో కలిసి డీఎస్పీ మాట్లాడుతూ నూతన సంవత్సర వేడుకలను ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని, భద్రతకు కూడా ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. రాత్రి 12.30గంటలలోపు వేడుకలు ముగించాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని, ద్విచక్రవాహనాల సైలెన్సర్లు తీసి నడపకూడదని, యువత హద్దుల్లో ఉండాలన్నారు. వేగంగా వాహనాలు నడిపినా కేసులు నమోదు చేస్తామన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వకుండా తల్లిదండ్రులు జాగ్రత్త పడాలన్నారు. వేడుకల్లో ఏవైనా సంఘటనలు చోటుచేసుకుంటే వారికి, వారి కుటుంబీకులకు కూడా నష్టపోతారని హెచ్చరించారు. ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ సహకారంతో పట్టణంలో అధునాతన కెమెరాలను అమర్చనున్నట్లు పేర్కొన్నారు.

మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు


వాహనాలను తనిఖీ చేస్తున్న సీఐ, సిబ్బంది

బత్తలపల్లి, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని సీఐ ప్రభాకర్ హెచ్చరించారు. మండల కేంద్రంలో ఆదివారం సీఐ ఆధ్వర్యంలో పోలీసులు వాహనాల తనిఖీ చేశారు. కార్లను ఆపి డ్రైవింగ్ చేసే సమయంలో పాటించవలసిన నిబంధనలను డ్రైవర్లకు వివరించారు. మద్యం తాగినవారు వాహనాలు నడపడం నేరమన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

పుట్టపర్తిరూరల్, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలో అక్రమంగా కర్ణాటక మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ నాగరాజు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ మండలంలో అక్రమ మద్యం విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు పెడపల్లిలో దాడులు నిర్వహించి 40 డిప్స్ కర్ణాటక మద్యం, స్వాధీనం చేసుకుని ఒకరిని అరెస్టు చేశామన్నారు. దాడుల్లో ఎస్ఐ ఉమామనోహర్‌రాజు, సిబ్బంది ఉన్నారు.


స్వాధీనం చేసుకున్న కర్ణాటక మద్యం

ఈ రోడ్డుపై నడిచేదెలా..?

● సంతగేటు కాలనీవాసుల ఆవేదన


సంతగేటు కాలనీలోకి వెళ్లే రోడ్డు ఇదే..

తనకల్లు, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): ఈ రోడ్డు వెంబడి కాలనీలోకి ఎలా వెళ్లాలని సంత గేటు కాలనీవాసులు ప్రశ్నిస్తున్నారు. మండలకేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న కాలనీలోకి వెళ్లాలంటే ఎవరైనా చెప్పులు చేతిలో పట్టుకుని బురదలో దిగి నడవాల్సిందే. కాలనీ పక్కనే ఎఫ్‌సీఐ గోడౌన్ నిర్మాణం చేపట్టారు. దీంతో రోజూ టన్నులకొద్దీ బియ్యం గోడౌన్‌కు రావడం, ఇక్కడి నుంచి తనకల్లు, నల్లచెరువు మండలాలకు సరఫరా జరుగుతోంది. దీంతో రోడ్డు మొత్తం బురదమయం అయ్యింది. నడవడానికి వీలు కానిపరిస్థితి నెలకొంది. మాగోడు పట్టించుకోవాలని అధికారులు, పంచాయతీ చుట్టూ తిరిగినా పట్టించుకునే నాథుడే లేడని వాపోతున్నారు. కాలనీలో కేవలం దళిత, గిరిజన, వెనుకబడిన కులాలవారుండడంతోనే అధికారులు పట్టించుకోవడం లేదని కాలనీవాసులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వెంటనే కాలనీకి వెళ్లే రోడ్డుకు కనీసం మట్టితో అయినా మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.

మహిళ అదృశ్యం

కదిరి అర్బన్, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఓ మహిళ అదృశ్యమైనట్లు సీఐ నారాయణరెడ్డి ఆదివారం తెలిపారు. వలీసాబ్‌రోడ్డులో నివాసమున్న షేక్ రుబీనా 23వ తేదీన ఇంటి నుంచి బయటికెళ్లి తిరిగి రాలేదన్నారు. బంధువులు, స్నేహితుల వద్ద విచారించినా ఆచూకీ తెలియకపోవడంతో ఆమె భర్త షేక్ సాదిక్ ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఆయన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ఆమెకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నట్లు చెప్పారు.

బీజేపీ నాయకుడిపై కేసు

కదిరి అర్బన్, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన బీజేపీ నాయకుడు దేవానంద్‌పై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ నారాయణరెడ్డి ఆదివారం తెలిపారు. మున్సిపాల్టీ పరిధిలోని బంగారు లక్ష్మణ్ కాలనీకి చెందిన శ్రీనివాసులు, మరికొంతమంది అనుమతులు లేకుండా నీటిసరఫరా కోసం మున్సిపల్ నీటి పైపులు పగలకొట్టి అక్రమంగా నీటిసరఫరా చేసుకున్నారన్నారు. మున్సిపల్ అధికారులు, సిబ్బంది సంఘటనాస్థలానికెళ్లి అనుమతులు లేకుండా ఎలా నీటిని తీసుకుంటారని ప్రశ్నించగా, దేవానంద్ ఎలాంటి అనుమతులు తీసుకోవద్దని చెప్పాడని వారు పేర్కొన్నారన్నారు. దురుసుగా ప్రవర్తించారని మున్సిపల్ కమిషర్ కిరణ్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు దేవానంద్‌తో పాటు శ్రీనివాసులుపై కేసు నమోదు చేశామన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

గాండ్లపెంట, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వెంకటరామిరెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ సోమవారం ఉదయం 11 గంటలకు ఎంపీపీ గంగోజమ్మ అధ్యక్షతన సమావేశం ఉంటుందన్నారు. అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలన్నారు.

పీఎఫ్, గ్రాట్యుటీ చెల్లించాలి

ఓబుళదేవరచెరువు, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): రిటైర్డు ఉద్యోగులకు పీఎఫ్, గ్రాట్యుటీ చెల్లించాని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ నాయకులు ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు గౌస్‌లాజం మాట్లాడుతూ గత యేడాది పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులకు గ్రాట్యుటీ, ప్రావిడెంట్‌ఫండ్ చెల్లించడం ఆపేశారని, పీఎఫ్ చెల్లించాలన్నారు. ఉద్యోగులు దరఖాసు చేసుకున్న పీఎఫ్ ఏపీజీఎల్ఐ రుణాలు వారి ఖాతాలో జమ చేయాలన్నారు. 1 నుంచి 10 వరకు సమాంతర మాధ్యమాన్ని కొనసాగించాలన్నారు. 30 శాతం మధ్యంతర భృతిని ప్రభుత్వం వెంటనే ప్రకటించాలన్నారు. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నరసింహులు, సోమశేఖర్ నాయక్, వెంకటాచలమయ్య, నాగరాజు పాల్గొన్నారు.

భోజన ప్యాకెట్ల పంపిణీ

ధర్మవరం, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): పాడేరు నుంచి పుట్టపర్తికి వస్తున్న 210 మంది సేవాదళ్ కార్యకర్తలకు ధర్మవరం రైల్వేస్టేషన్‌లో సత్యసాయి సేవాసమితి కన్వీనర్ నామా ప్రసాద్ ఆధ్వర్యంలో భోజన ప్యాకెట్లను ఆదివారం పంపిణీ చేశారు. భగవాన్ సత్యసాయిబాబా ఆశీస్సులతో పుట్టపర్తికి వెళ్లే భక్తులకు వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు.

శబరిమలకు సైకిల్ యాత్ర


బయలుదేరుతున్న అయ్యప్ప మాలధారులు

ధర్మవరం, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): పట్టణం నుంచి శబరిమలకు అయ్యప్ప మాలధారులు సైకిల్ యాత్ర చేపట్టారు. ఆదివారం స్థానిక చెరువు కట్ట వద్దనున్న అయ్యప్పస్వామి భజనమందిరం నుంచి 18 మంది మాలధారులు సైకిళ్లపై బయలుదేరి వెళ్లారు. సైకిళ్లకు గురుస్వామి విజయ్‌కుమార్ పూజలు చేశారు. వారంరోజుల్లో అయ్యప్ప సన్నిదానికి చేరుకుంటామని అయ్యప్ప మాలదారులు తెలిపారు. ప్రతి ఏడాది సైకిల్ యాత్ర చేస్తున్నామని మాలధారులు పేర్కొన్నారు. యాత్రలో మాలధారులు లోకేశ్, ఓబుళేశు, రాజా, మనికంఠ, ఓంకుమార్, జగదీశ్, తేజ, సుంకర చిన్న, మహేశ్‌రెడ్డి, కుమార్, బాలు, నాగేంద్ర, కల్యాణ్, వంశీ, ప్రవీణ్ పాల్గొన్నారు.

ఘనంగా ఎస్‌ఎఫ్‌ఐ ఆవిర్భావ దినోత్సవం

ధర్మవరం, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): ఎస్ఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవాన్ని పట్టణంలోని ఇందరమ్మకాలనీలో గల బాలుర వసతిగృహం వద్ద ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎస్ఎఫ్ఐ మాజీ నాయకుడు ఎస్‌హెచ్ బాషా జెండాను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. 1970లో కేరళరాష్ట్రంలోని తిరువనంతపురంలో సంఘం ఆవిర్భవించిందన్నారు. స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం, సోషలిజం నినాదంతో అధ్యయనం పోరాటమంటూ విద్యార్థుల సమస్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో అనేక ఉద్యమాలు చేపడుతూ దేశంలోనే అతిపెద్ద విద్యార్థిసంఘంగా ఏర్పడిందన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నామాల నాగార్జున, కనుమ దామోదర్ పాల్గొన్నారు.

మండల కమిటీ ఎన్నిక


ఐక్యత చాటుతున్న నూతన కమిటీ సభ్యులు

ముదిగుబ్బ, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): వడ్డెర సంక్షేమ సంఘం జిల్లా నాయకులు మల్లేపల్లి ఉత్తన్న, వలిపి గంగరాజు ఆధ్వర్యంలో ఆదివారం ముదిగుబ్బ మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ మండల అధ్యక్షుడిగా కేతన వెంకటపతి, ఉపాధ్యక్షుడిగా కేతన ప్రభాకర్, కార్యదర్శిగా దేరంగుల వేమయ్య, కార్యవర్గసభ్యులుగా రాజశేఖర్, రామాంజనేయులు, నాగరాజు, ఆదినారాయణలను ఎన్నుకున్నారు. వెంకటపతి మాట్లాడుతూ వడ్డెర్లకు ఏ సమస్య వచ్చినా మీకు అందుబాటులో ఉంటూ వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. నాయకులు శ్రీరాములు, నారాయణ, పుల్లప్ప, రాజన్న, కేశవయ్య, నరసింహులు పాల్గొన్నారు.

చోరీ కేసులో ముగ్గురు నిందితుల అరెస్టు

గోరంట్ల, డిసెంబరు29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు ఇళ్లలో చోరీలు చేసిన దొంగల ముఠాకు చెందిన సింహాద్రి, శివరాజ్‌కుమార్, శ్రీహరిలను ఆదివారం అరెస్టు చేసినట్లు పెనుకొండ డీఎస్పీ వెంకటేశ్వర్లు తెలిపారు. నిందితులనుంచి 12 తులాల బంగారు నగలు, ఒక ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకున్నట్లు గోరంట్ల పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ ఆదివారం వివరించారు. లేపాక్షికి చెందిన సింహాద్రి, కర్నాటకలోని నగరిగేరేకు చెందిన శివరాజ్‌కుమార్, పాత నేరస్తులని, వీరిద్దరితోపాటు లేపాక్షికి చెందిన శ్రీహరి కలిసి గత కొంతలకాలంగా ఒంటరిగా ఉన్న వృద్ధ మహిళలకు మాయమాటలు చెప్పి, వారి వద్ద ఉన్న బంగారు వస్తువులను చోరీ చేసేవారన్నారు. ఈఏడాది ఏప్రిల్ 3న గోరంట్లలోని బూడిదదిన్నెలో ఉంటున్న జయచంద్రా, వేణుగోపాల్ ఇళ్లలో తాళం పగులకొట్టి రెండు బంగారు చైన్లు, జతకమ్మలు, నాలుగు ఉంగారాలు ఎత్తుకెళ్లారన్నారు. ఆగస్టు 30న ఎముకలగుట్లపల్లిలో శివామ్మ అనే వృద్ధురాలితో ఆధార్, రేషన్‌కార్డు తనికీచేయడానికి వచ్చామని ఆమె మంగళసూత్రాల చైన్ లాక్కెళ్లారన్నారు. ఈమేరకు కేసు నమోదు చేసిన గోరంట్ల పోలీసులు, నిందితులను పట్టుకుని, చోరీ సొమ్మును వారినుంచి రికవరీ చేశారన్నారు. నిందితులను రిమాండ్‌కు పంపుతున్నట్లు చెప్పారు.


పట్టుబడిన బంగారంతో డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ శేఖర్

కమ్మేసిన పొగమంచు..



తనకల్లు, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రాన్ని ఆదివారం ఉదయం పొగమంచు కమ్మేసింది. ఉదయం 9 గంటలైనా పొగ మంచుతో రోడ్లు కూడా కనిపించని పరిస్థితి. వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వాతావరణంలో మార్పుల వల్లనే ఇలా పొగమంచు ఏర్పడుతున్నట్లు ప్రజలు అంటున్నారు.

తనకల్లు జాతీయ రహదారిపై కమ్మేసిన పొగమంచు

మూతపడిన గ్రంథాలయ భవనం

● రూ.3 లక్షల నిధులు వృథా ● పట్టించుకోని అధికారులు



గొట్లూరులో మూతపడిన గ్రంథాలయ భవనం

ధర్మవరంరూరల్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొట్లూరు గ్రామంలో గ్రంథాలయం మూతపడింది. 2017లో అప్పటి టీడీపీ ప్రభుత్వంలో ఎస్‌డీఎఫ్ నిధులు రూ.3 లక్షల వ్యయంతో గ్రంథాలయాన్ని నిర్మించి ప్రారంభించారు. కొద్దిరోజులు వార్తాపత్రికలు వచ్చేవని గ్రామస్థులు తెలిపారు. కొన్నేళ్లుగా గ్రంథాలయం మూతపడటంతో ప్రస్తుతం ఆ భవనం వృథాగా ఉంది. గ్రామంలో ఎక్కువ మంది విద్యార్థులు, పాఠకులు, ఉద్యోగులు ఉన్నారు. గ్రంథాలయ ఉన్నతాధికారులు స్పందించి గ్రంథాలయాన్ని తెరవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

క్లుప్తంగా..

బీజేపీ మండలాధ్యక్షుడిగా బోయ లక్ష్మీనారాయణ



లక్ష్మీనారాయణను అభినందిస్తున్న బీజేపీ నాయకులు

గోరంట్ల, డిసెంబరు29(ఆంధ్రజ్యోతి): బీజేపీ మండలాధ్యక్షుగా జీనవాండ్లపల్లికి చెందిన బోయ లక్ష్మీనారాయణ ఎంపికయ్యారు. గోరంట్లలోని బీజేపీ కార్యాలయంలో పార్టీ సంస్థాగత ఎన్నికల సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా బోయ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. పార్టీ అభివృద్ధికి తనవంతుగా కృషి చేస్తానని తెలిపారు. తమ నియామకానికి సహకరించిన జిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్, మంత్రి సత్యకుమార్ యాదవ్, రాష్ట్రఅధ్యక్షులు పురందేశ్వరికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఈశ్వర్‌రెడ్డి, శ్రీనివాసులు, ముంతాజమ్మ, రామాంజనమ్మ, లక్ష్మీదేవి, నాగరాజుయాదవ్, లక్ష్మీరెడ్డి, గంగాధర్, వెంకటాచలం, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

రేపు పింఛన్ల పంపిణీ

గోరంట్ల, డిసెంబరు29(ఆంధ్రజ్యోతి): మండలవ్యాప్తంగా మంగళవారం పింఛన్ల పంపిణీ నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ నరేంద్రకుమార్ తెలిపారు. మండలంలోని 20 పంచాయతీల్లో 11,359మందికి రూ.4,83,67,500లు పంపిణీచేయడానికి సన్నాహాలు చేస్తున్నామన్నారు. జనవరి 1న ఆంగ్ల నూతన సంవత్సరం ప్రారంభం కావడంతో అధికారులు, సిబ్బంది అభ్యర్థన మేరకు ఒకరోజుముందే ప్రభుత్వం పింఛన్లు పంపిణీ చేస్తోందన్నారు.

వైభవంగా కనకదాస జయంతి



కార్యక్రమంలో మంత్రి సవిత, ఎంపీ బీకే పార్థసారథి

పరిగి, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): కురుబల ఆరాధ్య దైవం భక్త కనకదాస జయంతి వేడుకలను మండలంలోని గొల్లపల్లి, వన్నంపల్లి గ్రామాల్లో ఆదివారం అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. కార్యక్రమానికి బీసీ సంక్షేమ చేనేత జౌళిశాఖ మంత్రి సవిత, హిందూపురం పార్లమెంట్ సభ్యులు బీకే పార్థసారథి హాజరయ్యారు. స్థానిక మహిళలతో పాటు మంత్రి సవిత వన్నంపల్లి, గొల్లపల్లి గ్రామాల్లో జ్యోతులు మోస్తూ కనకదాస విగ్రహానికి చేరుకుని జ్యోతులు సమర్పించారు. అనంతరం గొరవనహళ్లి గ్రామంలో లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో కుంభాభిషేకంలో పాల్గొని పుట్టగూర్లపల్లిలోని అయ్యప్పస్వామి దేవాలయంలో మాలధారుల కోరిక మేరకు మంత్రి సవిత పూజకు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ గోవిందరెడ్డి, సర్పంచ్ బాలాజీ, మారుతి, తిలక్, కాంట్రాక్టర్ మహేశ్వర్‌రావు, వడ్డె హనుమయ్య తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛంద సంస్థల సేవలు అవసరం



ఎస్ఎస్‌టీ ఆధ్వర్యంలో పూర్వ ఉద్యోగుల కలయిక

పెనుకొండ టౌన్, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి అనంతపురం, సత్యసాయి జిల్లాల్లో స్వచ్ఛంద సేవా సంస్థల సేవల అవసరం ఎంతైనా ఉందని స్త్రీ సంక్షేమ ట్రస్ట్ డైరెక్టర్ చంద్రకాంజిలాల్ పేర్కొన్నారు. పూర్వ ఉద్యోగుల కలయిక కార్యక్రమాన్ని ఆదివారం మండలంలోని రాంపురం పంచాయతీ ట్రస్ట్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 1987లో ఎస్ఎస్‌టీ(స్త్రీ సంక్షేమ ట్రస్ట్) ఏర్పాటుచేసి ఎన్నో కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో మైత్రి కాంజిలాల్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎస్ఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవం

లేపాక్షి, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి):ఎస్ఎఫ్ఐ 55వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఆదివారం బీసీ బాలుర వసతి గృహం వద్ద ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. హాస్టల్ విద్యార్థులతో మమేకమై జెండా ఆవిష్కరణ గావించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యారంగం మెరుగు కోసం ఎస్ఎఫ్ఐ ఎప్పుడూ పోరాటం చేస్తుందన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలన్నారు. వసతి గృహంలో విద్యార్థులకు అన్ని సౌకర్యాలు అందించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పలువురు హాస్టల్ విద్యార్థులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి అండగా నిలబడాలి

పావగడ, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): గ్యాస్ సిలెండర్ పేలి ఇల్లులేక నిరాశ్రయులైన హరిహరపురం గ్రామానికి చెందిన భూతమ్మ కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలిచి మౌలిక సదుపాయాలు కల్పించాలని బీపీఎస్(భారతీయ పరివర్తనసంఘ) అధ్యక్షులు, హైకోర్టు న్యాయవాది ప్రొఫెసర్ హరిరామ్ తెలియజేశారు. ఆదివారం హరిహరపురం గ్రామానికి చేరుకొని బాధితుల కుటుంబాన్ని కలిసి వారికి మనోధైర్యం కల్పించారు. ఆ కుటుంబంలోని ఆడబిడ్డకు విద్యకు సంబంధించిన పుస్తకాలన్నీ అందజేసి కేఏఎస్ చదవడానికి తమ సంస్థ నుండి అవకాశం కల్పిస్తామని, ఆఖర్చులన్నీ భరిస్తామని ఆయన తెలిపారు.

చంద్రప్ప మరణం టీడీపీకి తీరనిలోటు



నగదు అందజేస్తున్న టీడీపీ నాయకులు

రొళ్ల, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దొడ్డేరి పంచాయతీ కొత్తపల్లి తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీటీసీ చంద్రప్ప అనారోగ్యంతో మృతి చెందడం టీడీపీకి తీరనిలోటని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. ఈవిషయం తెలుసుకొన్న ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు, ఇన్‌ఛార్జి గుండుమల తిప్పేస్వామిలు పార్టీ ఆ కుటుంబానికి అండగా ఉంటామని పేర్కొన్నారు. అదేవిధంగా ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు ఆ కుటుంబ సభ్యులకు రూ.10వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈకార్యక్రమంలో మండల కన్వీనర్ దాసిరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఈరన్న, రాష్ట్ర కార్యదర్శి గురుమూర్తి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

అటకెక్కిన వాటర్ ప్లాంట్లు



మూతపడ్డ హరేసముద్రం నీటి ప్లాంటు

- గ్రామాల్లో మూతపడిన తాగునీటి పథకాలు
- పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న ప్రైవేట్ మినరల్ ప్లాంట్లు
- అధిక ధరతో నీరు కొనలేకపోతున్న సామాన్యులు

మడకశిర రూరల్, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి) గ్రామీణ ప్రాంత ప్రజలకు స్వచ్ఛమైన శుద్ధనీటిని అందించడం కోసం టీడీపీ ప్రభుత్వం పంచాయితీ కేంద్రాల్లో 9 ఎన్‌టీఆర్ సుజల స్రవంతి మినరల్ వాటర్ ప్లాంట్లను ప్రవేశపెట్టింది. బిందె నీటిని రెండు రూపాయలకే ప్రజలకు అందించింది. వైసీపీ అధికారం చేపట్టిన తరువాత మండలంలోని వాటర్ ప్లాంట్లలో కొన్ని సక్రమంగా



వైబీ హళ్లి ప్లాంటు దుస్థితి

పనిచేయకపోగా, మరికొన్ని అసలుకే మూతపడ్డాయి. హరేసముద్రం, వైబి హళ్ళి, నీలకంఠాపురం, చందదకచర్ల, ఆమిదాలగొంది, కల్లుమర్రి, ఆర్ అనంతపురం, మెళవాయి, తాగునీటి ప్లాంట్లు మూతబడిన జాబితాలో ఉన్నాయి. వైబి హళ్ళిలో మంచి నీటి ప్లాంటు మూతపడి మూడు సంవత్సరాలు అవుతోంది. హరేసముద్రం,ఆమిదాలగొంది గ్రామాల్లో ప్లాంటు మూడపడి ఎనిమిది నెలలు అవుతోంది. వైసీపీ పాలనలో పంచాయితీలకు నిధుల కొరత కారణంగా ప్లాంట్లుకు వచ్చిన విద్యుత్ బిల్లులు చెల్లించలేదు. కొన్నిచోట్ల యంత్రాలకు మరమ్మతులు చేయించలేదు. దీంతో కొన్ని ప్లాంట్లు మూతపడగా, మరి కొన్ని నిరుపయోగంగా మారాయి. ప్లాంట్లు మూతపడడంతో గ్రామాలకు వచ్చే ప్రైవేట్ వాహనాలు బిందె నీరు రూ.8, క్యాన్ రూ.15 వంతున అమ్మడం ప్రారంభించారు. అధిక ధరలు పెట్టి ప్రతిరోజూ తాగునీటిని కొనలేకపోతున్నామని ప్రజలు వాపోతున్నారు. కూటమి ప్రభుత్వం గ్రామాల్లో మూతపడ్డ తాగునీటి ప్లాంట్లను మళ్ళీ ప్రారంభించాలని ప్రజలు కోరుతున్నారు.

మూతపడ్డ తాగునీటి ప్లాంటును పునఃప్రారంభిస్తాం



రామాంజనేయులు, సర్పంచు, వైబీ హళ్ళి

గతంలో పనిచేస్తున్న మినరల్ వాటర్ ప్లాంట్లు నిధుల కొరత వలన మూతపడ్డాయి. దీంతో ప్రజలు తాగునీటి కోసం నానా ఇబ్బంది పడ్డారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో గ్రామంలో మూతపడి నిరుపయోగంగా ఉన్న తాగునీటి ప్లాంటుకు మరమ్మతులు చేసి త్వరలో తిరిగి పారంభిస్తాం. స్వచ్ఛమైన తాగునీటిని ప్రజలకు అందిస్తాం.

ఔను.. వారంతా మాట్లాడుకున్నారు!



అధ్యాపకులతో పూర్వ విద్యార్థులు

పెనుకొండ, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): 'ఏరా ఎలా ఉన్నావు.. బాగున్నావా? ఎన్నాళ్లయింది నిన్ను చూసి.. ఏం చేస్తున్నావ్? పిల్లలెంతమంది?' అంటూ ఆప్యాయంగా మనసు విప్పి మాట్లాడుకున్నారు. స్థానిక పరిటాల శ్రీరాముల ప్రభుత్వ డిగ్రీకళాశాలలో 2005-2008 సంవత్సరం బ్యాచ్‌కు చెందిన 60మంది పూర్వ విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. ఈ ఆత్మీయ సమావేశంలో ముందుగా ఒకరినొకరు యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆనాటి మధుర జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. తమ అభ్యున్నతికి కళాశాల అధ్యాపకులు ఎంతో కృషిచేశారని, ఆనాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. తమ భవిష్యత్తు అభివృద్ధిలో కళాశాల చెరగని ముద్ర వేసిందన్నారు. తమ జ్ఞాపకాలు నెమరవేసుకుని అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందిని ఘనంగా సత్కరించి వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డా.జయప్ప, అధ్యాపకులు ప్రతాప్, దేవిశెట్టి రామన్న, నరసింహులు, జగన్నాథ్, అధ్యాపకేతర సిబ్బంది నాగరాజు, శంకర్, నబీరసూల్, రామక్రిష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రమాదాలకు నిలయం కోనాపురం దారి

- దారిపక్కన కంపచెట్లను తొలగించాలని గ్రామస్థుల వినతి

పెనుకొండ రూరల్, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): పెనుకొండ నగర పంచాయతీ కోనాపురం గ్రామ సమీపంలోని రోడ్డు ప్రమాదాలకు నిలయంగా మారింది. గ్రామంలో 500కుపైగా కుటుంబాలుండగా, 1800కుపైగా జనాభా ఉంది. నిత్యం పనుల కోసం గ్రామస్థులు పెనుకొండకు వచ్చి వెళ్తుంటారు. ఈ క్రమంలో కోనాపురం గ్రామ సమీపంలో రోడ్డుకు ఇరువైపులా చెట్లు ఏపుగా పెరగడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనబడక ప్రమాదాలు జరుగుతున్నాయని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామ సమీపంలో గత 30రోజుల వ్యవధిలో ముగ్గురు గాయపడ్డారన్నారు. ఇప్పటికైనా నగర పంచాయతీ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కోనాపురం గ్రామ సమీపంలో రోడ్డుపక్కన ఏపుగా పెరిగిన ముళ్ల కంపలను తొలగించాలని గ్రామస్థులు కోరుతున్నారు.



కోనాపురం సమీపంలో మలుపు వద్ద ఏపుగా పెరిగిన కంపచెట్లు

సీపీఎం రాష్ట్రస్థాయి సమావేశం

పావగడ, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): తుమకూరు పట్టణంలో 24వ సీపీఐ, సీపీఎం రాష్ట్రస్థాయి సమావేశాన్ని ఆదివారం వేలాదిమంది పార్టీ కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. టౌన్‌హాల్ సర్కిల్ నుండి సీపీఎం కార్యాలయం వరకు ఊరేగింపుగా వెళుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ సిద్ధాంతాలతో సమాజాన్ని ధర్మాల పేరిట విభజించి హిందూరాష్ట్రంగా మార్చి మతాలపేరిట మంటగలుపుతున్నారని మాజీ విద్యాశాఖ మంత్రి సీపీఐఎం పార్టీ బ్యూరో సభ్యురాలు ఎం.ఎ.బేబీ ఆరోపించారు. ఇతర పార్టీల లాగ తమ పార్టీ బూటకపు హామీలు ఇవ్వదన్నారు.

రోడ్డు వేయరూ..!

గుడిబండ, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొంకల్లు గ్రామం నుండి ఫళారం గ్రామానికి రోడ్డు నిర్మాణం చేపట్టాలని కొంకల్లు గ్రామస్తులు కోరారు. గతంలో కొంకల్లు నుండి ఫళారం మీదుగా గుడిబండకు వెళుతుండేవారమని, అయితే ప్రస్తుతం అధిక వర్షాల వల్ల ఆరోడ్డులో ప్రయాణించాలంటే తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోందని ప్రజలు వాపోయారు. ప్రస్తుతం గుడిబండ చేరుకోవాలంటే కొంకల్లు నుండి దిన్నేహట్టి, ఫళారం, గుడిబండ మీదుగా వెళుతున్నామని తెలిపారు. అధికారులు చొరవ తీసుకొని కొంకల్లు నుండి ఫళారం మీదుగా రోడ్డు నిర్మాణం చేపట్టి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరారు.

అనారోగ్యంతో మాజీ వైస్ ఎంపీపీ మృతి



గోపాలప్ప(ఫైల్)

మడకశిర రూరల్, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి) : మండలంలోని హరేసముద్రం గ్రామానికి చెందన టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ వైస్ ఎంపీపీ గోపాలప్ప (59) ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. గోపాలప్ప గత కొంతకాలంగా ఆనారోగ్యంతో బాధపడుతున్నట్లు తెలిపారు. ఆదివారం తుంకూర్ ఆసుపత్రికి తీసుకెళ్లగా అక్కడ చికిత్సపొందుతూ మృతిచెందాడన్నారు. సోమవారం స్వగ్రామంలో అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

గుర్తుతెలియని శవం లభ్యం

పరిగి, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెర్లోపల్లి గ్రామ సమీపంలో సేవామందిరం-మధుగిరి రహదారి పక్కన ఆదివారం గుర్తుతెలియని శవం లభ్యమైనట్లు ఎస్ఐ రంగడుయాదవ్ తెలిపారు. ఎస్ఐ మాట్లాడుతూ 30-35 వయసు కలిగిన వ్యక్తి నాలుగు రోజుల క్రితమే మృతిచెంది ఉండవచ్చన్నారు. స్థానికుల సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదుచేసినట్లు తెలిపారు. పూర్తి వివరాలు దర్యాప్తులో తేలాల్సి ఉందన్నారు.. ఇది సాధారణ మృతినా? లేక ఎవరైనా చంపి ఇక్కడ పడేసి వెళ్లారా? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పాటల రూపంలో మనమధ్యనే ఘంటసాల

- జయంతి వేడుకల్లో హైదరాబాద్ కల్యాణి

హిందూపురం అర్బన్, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): ఎన్ని సంవత్సరాలు గడిచినా ఘటసాల వెంకటేశ్వరరావును స్మరించుకుంటున్నామంటే ఆయన ఆలపించిన మధురాతి మధురగీతాలే అందుకు కారణమని ప్రముఖ గాయకురాలు హైదరబాద్ కల్యాణి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక కళాక్షేత్రంలో జరిగిన ఘంటసాల 101 జయంతి వేడుకలకు ఆమె ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఘంటసాల భౌతికంగా మనకు దూరమైనా ఆయన పాడిన పాటల రూపంలో మన అందరి మధ్యనే ఉన్నారన్నారు. ఈసందర్భంగా పలువురు మధుర గీతాలను ఆలపించి ఆయన్ను స్మరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ బలరామిరెడ్డి, జడ్జి రోషన్, రమేష్ లోకేష్, ప్రసాదరావు, ఎంఈఓ గంగప్ప తదితరులు ఉన్నారు.

సిద్దేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

అమరాపురం, డిసెంబరు29(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని హేమావతి శ్రీ హెంజేరు సిద్దేశ్వరస్వామి వారికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా సిద్దేశ్వరస్వామికి వివిధ అభిషేకాలు, కుంకుమార్చన, రుద్రాభిషేకం చేసి తీర్థప్రసాద వినియోగం చేశారు. అదేవిధంగా స్వామివారి ఆలయ ప్రాంగణంలో ఉన్న శ్రీకాలభైరవేశ్వరస్వామి, శ్రీదొడ్డేశ్వరస్వామి, శ్రీమల్లేశ్వరస్వామి దేవాలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు కమిటీ చైర్మన్ కరేగౌడ్ తెలిపారు.

చోరీ కేసులో ముగ్గురు నిందితుల అరెస్టు



పట్టుబడిన బంగారంతో డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ శేఖర్

గోరంట్ల, డిసెంబరు29(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు ఇళ్లలో చోరీలు చేసిన దొంగల ముఠాకు చెందిన సింహాద్రి, శివరాజ్‌కుమార్, శ్రీహరిలను ఆదివారం అరెస్టు చేసిన్నట్లు పెనుకొండ డీఎస్పీ వెంకటేశ్వర్లు తెలిపారు. నిందితులనుంచి 12 తులాల బంగారు నగలు, ఒక ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకున్నట్లు గోరంట్ల పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ ఆదివారం వివరించారు. లేపాక్షికి చెందిన సింహాద్రి, కర్నాటకలోని నగరిగేరేకు చెందిన శివరాజ్‌కుమార్, పాత నేరస్తులని, వీరిద్దరితోపాటు లేపాక్షికి చెందిన శ్రీహరి కలిసి గత కొంతలకాలంగా ఒంటరిగా ఉన్న వృద్ధ మహిళలకు మాయమాటలు చెప్పి, వారి వద్ద ఉన్న బంగారు వస్తువులను చోరీ చేసేవారన్నారు. ఈఏడాది ఏప్రిల్ 3న గోరంట్లలోని బూడిదదిన్నెలో ఉంటున్న జయచంద్రా, వేణుగోపాల్ ఇళ్లలో తాళం పగులకొట్టి రెండు బంగారు చైన్లు, జతకమ్మలు, నాలుగు ఉంగారాలు ఎత్తుకెళ్లారన్నారు. ఆగస్టు 30న ఎముకలగుట్లపల్లిలో శివామ్మ అనే వృద్దురాలితో ఆధార్, రేషన్‌కార్డు తనికీచేయడానికి వచ్చామని ఆమె మంగళసూత్రాల చైన్ లాక్కెళ్లారన్నారు. ఈమేరకు కేసు నమోదు చేసిన గోరంట్ల పోలీసులు, నిందితులను పట్టుకుని, చోరీ సొమ్మును వారినుంచి రికవరీ చేశారన్నారు. నిందితులను రిమాండ్‌కు పంపుతున్నట్లు చెప్పారు.

పాముకాటుతో రైతుకు అస్వస్థత

గోరంట్ల, డిసెంబరు29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మేరెడ్డిపల్లి గ్రామానికి చెందిన రైతు కదిరప్ప పాముకాటుకు గురై ఆదివారం అస్వస్థతకు గురైయ్యారు. పొలంలో పనిచేస్తుండగా ఆదివారం కుడికాలుపై నాగుపాము కాటు వేసింది. వెంటనే అతన్ని గోరంట్ల ప్రభుత్వ ఆసుప్రతికి తరలించగా, ప్రథమచికిత్స అనంతరం మెరుగైన వైద్యంకోసం 108లో పుట్టపర్తి ఆసుపత్రికి తరిలించారు.

చర్చి ఆధ్వర్యంలో క్రీడాపోటీలు

హిందూపురం అర్బన్, డిసెంబరు 29,(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని సీఅండ్ఐజి కాంపౌండ్ చర్చి ఆధ్వర్యంలో క్రైస్తవ సోదర సోదరీమణులకు, చిన్నారులకు క్రీడాపోటీలు నిర్వహించారు. ఆదివారం స్థానిక చర్చి గ్రౌండ్‌లో చర్చి పాస్టర్ స్టీఫెన్‌రాజ్, కార్యదర్శి నాగేంద్ర ఆధ్వర్యంలో చిన్న పిల్లలకు పరుగుపందాలు, మహిళల కుర్చీల ఆట, లెమన్ అండ్ స్పూన్, పాటల పోటీలు, అదే విధంగా యువతకు వాలీబాల్, బాల్ బ్యాడ్మింటన్, క్యారంబోర్డు పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు 2025 నూతన సంవత్సరంలో బహుమతులు అందిస్తామన్నారు. క్రీడా నిర్వహకులుగా శ్యాంబాబు, ప్రభుదాస్, జానీ, సందీప్, సురేష్, చిన్నా, వరుణ్ వ్యవహరించారు.

మంత్రి సవితను కలిసిన రజక కార్పొరేషన్ డైరెక్టర్



మంత్రిని సత్కరిస్తున్న రజక కార్పొరేషన్ డైరెక్టర్

పెనుకొండ, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రజక కార్పొరేషన్ డైరెక్టర్ పరమేశ్వరన్, రజక సంఘం నాయకులు మంత్రి సవితను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాకప్పి సన్మానించారు. అనంతరం ఆమెతో మాట్లాడుతూ.. జనవరి2న గొల్లపూడి బీసీ కార్పొరేషన్ కార్యాలయంలో తన ప్రమాణస్వీకారం జరుగుతుందని తప్పక హాజరు కావాలని ఆహ్వానించారు. రజకులు ఎదుర్కొంటున్న సమస్యల గురించి ఆమెతో చర్చించారు. ముఖ్యంగా దోబీఘాట్‌లు, ఇంటిస్థలాలు తదితర విషయాలను ఆమె దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో పరమేశ్వరన్, పెనుకొండ కరెంటు శ్రీనివాసులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా వేణుగోపాలస్వామి కల్యాణోత్సవం



అలంకరణలో వేణుగోపాలస్వామి

మడకశిరటౌన్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో ఆదివారం కళ్యాణోత్సవ కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించారు. వేణుగోపాలస్వామి విగ్రహ ప్రతిష్టాపన పూర్తయి 45 రోజులు పూర్తయిన సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 6 గంటల నుండి సుప్రభాతసేవ, స్వామి వారికి కొబ్బరితో విశేష అలంకరణ, హోమాలు, కలశారాధన, కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. రాత్రి స్వామివారి ఉత్సవ విగ్రహాలను పట్టణంలో ఊరేగించారు. అనేక మంది భక్తులు పాల్గొని స్వామి వారికి పూజలు, అభిషేకాలు ఘనంగా నిర్వహించారు.

సివిల్ రైట్స్‌పై అవగాహన

అగళి, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు అగళి మండలం ఇరిగేపల్లి ఎస్సీ కాలనీలో సివిల్ రైట్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ వీరేష్ పాల్గొని మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలు అన్ని వర్గాలతో కలిసి మెలిసి ఉండాలని ఎలాంటి బేధాభిప్రాయాలకు చోటు కల్పించకుండా ఉండాలన్నారు. రోడ్డు సేఫ్టీ, సైబర్ క్రైం, ఇలీగల్ యాక్టివిటీస్, సూసైడ్ తదితర వాటిపై ఎస్ఐ వివరించారు. అనంతరం అగళి మండల కేంద్రంలో వాహనాలను తనిఖీ చేశారు. ఇరిగేపల్లి టీడీపీ సర్పంచ్ లక్ష్మమ్మ, లింగరాజు, ఎఎస్ఐ బషీర్ పాల్గొన్నారు.

ఘనంగా రావిళ్ల లక్ష్మి జన్మదిన వేడుకలు



లక్ష్మికి శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే పీఏ బాలాజీ, బేవనహళ్లి ఆనంద్



శుభాకాంక్షలు తెలుపుతున్న టీడీపీ నాయకులు

హిందూపురం, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): హిందూపురం మునిసిపల్ మాజీ చైర్‌పర్సన్ రావిళ్ల లక్ష్మీనాగరాజు జన్మదిన వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని టీడీపీ సీనియర్ నాయకులు నాగరాజు ఇంటివద్ద ఆదివారం నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో తరలివచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా భారీ కేక్‌కట్‌చేశారు. మిఠాయిలు పంచి, శాలువలతో లక్ష్మీనాగరాజును సత్కరించి పుష్పగుచ్ఛాలను అందజేశారు. జన్మదినం సందర్భంగా అయ్యప్ప ఆలయంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు మాట్లాడుతూ భవిష్యత్తులో మరింత ఉన్నత పదవి సాధించాలని భగవంతుడు ఆయురారోగ్యాలు ఇవ్వాలని కోరారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో టీడీపీ మండల కన్వీనర్లు అశ్వర్థరెడ్డి, జయప్ప, రంగారెడ్డి, పట్టణాధ్యక్షులు రమేష్, వాల్మీకిఫెడరేషన్ డైరెక్టర్ బేవనహళ్లి ఆనంద్, ఎమ్మెల్యే పీఏ బాలాజీ, డీలర్ల సంఘం అధ్యక్షుడు బాబురెడ్డి, నాయకులు లింగారెడ్డి, రహిమాన్, అమీద్, భాస్కర్, రఫీక్, ఖలీల్, గోపాల్, వెంకటేశ్, చంద్రశేఖర్, శ్రీరామిరెడ్డి, రాజు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత

రొళ్ల, డిసెంబరు 29 (ఆంధ్ర జ్యోతి): రొళ్ల మండలం నసేపల్లి వద్ద మద్యం అక్రమంగా రవాణాచేస్తున్న తిమ్మరాజు, దేవరాజులను అరెస్టుచేసినట్టు ఎస్ఐ తెలిపారు. వారి వద్ద నుండి 45 కర్ణాటక మద్యం ప్యాకెట్లను స్వాధీనంచేసుకొని కేసు నమోదు చేసినట్టు తెలిపారు.